# ఉద్యమ కెరటం

www.udyamakeratam.com

నిజం.. రక్షతి రక్షితః

తెలుగు దినపత్రిక

UDYAMA KERATAM TELUGU DAILY

11.5.2025 ఆదివారం Sunday | సంపుటి (Volume): 1 సంచిక (Issue) : 346 | పేజీలు : 9 Pages : 9 | వెల: 5 RNI: TELTEL12329

Published from : Asifabad, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy



www.udyamakeratam.com

ఉద్యమ కెరటం

రిపోర్టర్లు కావలెను

ఉద్యమ కెరటం దిన పత్రిక లో పని చేయుటకు

జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ, మండల రిపోర్టర్లు కావలెను.

మీ ప్రాంతాలకు సంబంధించిన రాజకీయాలు, సామజిక, ఇతర అంశాల పై లోతైన విశ్లేషణలు, రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి.

ఆసక్తి గలవారు ఈ క్రింది నెంబర్, ఈ-మెయిల్‌కు తమ బయోడేటాను పంపగలరు.

సెల్: 9030717172

E-mail: udyamakeratamtelugudaily@gmail.com




## నా సిందూరాన్ని దేశ రక్షణకు పంపుతున్నా

- జవాన్ భార్య ధీరత్వం

02



## ఆపరేషన్ సిందూర్‌లో కీలక ఉగ్రవాదులు హతం

- వివరాలు వెల్లడించిన రక్షణశాఖ వర్గాలు

02



## ఈ యేడాది ముందుగానే రుతు పవనాలు

- 27న కేరళను తాకనున్న నైరుతి: ఐఎండి

03



# ఇక యుద్ధ చర్యే

దీటుగా బదులిచ్చేందుకు సిద్ధం..



- పాక్‌ను హెచ్చరించిన భారత ప్రభుత్వం
- పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఆమోదం
- ప్రధాని సమక్షంలో త్రివిధ దళాల సమావేశం
- గత రెండు రోజుల పరిణామాలపై సుదీర్ఘంగా చర్చ
- ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసిన ఆర్మీ
- సంధి ప్రేలానలను నమ్మొద్దంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ, మే 10 :** పాకిస్తాన్‌కు భారత్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు మించి ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పాక్‌పై పూర్తి స్థాయి యుద్ధానికి మోదీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో

మిగతా 2 లో



## దిమ్మతిరిగిన పాక్

- నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి
- ఉగ్రదాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని భారత్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు అమెరికాతో మధ్యవర్తిత్వం
- భారత్ దెబ్బకు పాక్ ఎయిర్ బేస్‌లన్నీ ధ్వంసం
- ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

02

## ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్

- తాత్కాలికంగా నిలిచిపోయిన మావోల ఏరివేత
- కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి
- సరిహద్దులో వెళ్లేందుకు ఆదేశాలు

02




**ములుగు, మే 10 :** ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్ – పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి

మిగతా 2 లో

## ఊచకోత కోయాలని ఇస్లాం చెప్పిందా?

- ఇస్లాం పేరుతో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్
- భారత్‌లో మత విద్వేషాలకు పాక్ కుట్ర
- పహల్గామ్ దాడికి భారత్ ధీటైన జవాబిస్తోంది
- ఉర్దూ జర్నలిస్టుల కార్యక్రమంలో ఓవైసీ హెచ్చరిక



03

# అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు



- జయజయహే రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభం
- 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన

02

నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియం వేదికగా పోటీలను ప్రారంభించారు. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు.

## పాక్ అరాచకాలకు మోడీ గట్టి సమాధానం

- రక్షణ దళాలకు స్థైర్యం కలిగించాలని అమ్మవారికి మొక్కులు
- బహీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

03






## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు
- ఇద్దరు వ్యక్తుల సజీవ దహనం

03

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# ఉగ్రదాడి ఇక యుద్ధ చర్యే



మొదటి పేజీ తరువాయి

మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది. భారత్-పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటు-చేసుకుంది. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో వరుసగా దాడులకు పాల్పడుతోంది. విమానాశ్రయాలు, సామాన్య పౌరులే లక్ష్యంగా దాయాది ఈ చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే గత రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ చేసిన డ్రోన్ల దాడులను భారత ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంది. ఆ దాడులకు ప్రతిస్పందనగా భారత ఆర్మీ ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లపై ఎటాక్ చేసి ధ్వంసం చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇండియన్ ఆర్మీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. భారత సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల నుంచి గతంలో భారత పౌరులు, భద్రతా దళాలపై దాడులకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడి నుంచి దాడులు కూడా చేశారు. భారత సైన్యం సత్వరమే స్పందించి ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. ఇప్పుడు లాంచ్‌ప్యాడ్‌ను ధ్వంసం చేయడంతో వారి మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలకు భారీ దెబ్బ తగిలిందని పోస్టులో భారత ఆర్మీ తెలిపింది.

ఇకపోతే పాకిస్థాన్ కావాలనే భారత్‌ను రెచ్చగొడుతోందని, యుద్ధానికి పురిగొల్పుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ద్వైపాక్షిక చర్చలు, వెనక్కి తగ్గుతామని ప్రకటించినా ఆ దేశాన్ని అంత సులువుగా నమ్మకూడదని అంటున్నారు. గతానుభవాలే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి కాలు దువ్వితే పాక్ ఆక్రమిత కశ్మీర్, బలోచిస్థాన్ వంటివి కోల్పోవాల్సి వస్తుందని బయం కూడా పాక్‌లో ఉందంటున్నారు. పహల్గాంలో పర్యాటకానికి వచ్చిన వారిని మతం అడిగి మరీ పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డాక దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. భారత్ కేవలం పాక్ ఉగ్రస్థావరాల మీదే దాడికి పాల్పడింది. మిలటరీ, పౌరుల జోలికి పోలేదు. భారత్ తనంతట తానుగా యుద్ధాన్ని కోరుకోవడం లేదనడానికి ఇదే నిదర్శనం. పాక్ పరిస్థితి వేరు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నా.. భారత్‌ను చూసి ఓర్వలేక కావాలనే కయ్యానికి కాలు దువ్వుతోంది. అక్కడి ప్రజలను, దేశ ఆర్థిక పరిస్థితి గురించి పట్టించుకునే పరిస్థితిలో ఆ దేశం లేదు. అక్కడి మిలటరీదే పైచేయి. ఉగ్రవాదుల్ని ముందు పెట్టి మిలటరీ వెనుకుండి నడిపిస్తోందని వీరు అభిప్రాయపడ్డారు. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని పాక్ విదేశాంగ శాఖ మంత్రి చేస్తున్న వ్యాఖ్యలను నమ్మరాదనికూడా వీరు హెచ్చరిస్తున్నారు. ఇలా చెబుతూనే మరోవైపు తమ సైన్యాన్ని సరిహద్దులవైపు నడిపిస్తోంది. మన దృష్టి మరల్చేందుకు పాక్ ఇలాంటి కుయుక్తులను పన్నుతుందని, పాక్ ఎప్పుడు ఏ మూల నుంచైనా దాడి చేసే అవకాశం ఉందని గుర్తుంచాలని అన్నారు. పాక్ ఓ వైపు డ్రోన్లను ప్రయోగిస్తోంది. స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రుల మీద దాడులు చేస్తోంది. మనం పాక్ పౌరుల జోలికి పోకపోయినా..

దాయాది దేశం మాత్రం ఉన్మాదంతో ఈ తరహా దాడులకు పాల్పడుతోంది. తమ ఆర్మీ బలమైనదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఒకవేళ ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులను నిజంగా తగ్గించుకోవాలని ఆ దేశం అనుకుంటే పాకిస్థానే వెనక్కి తగ్గాలి కదా అని అన్నారు. ఉగ్రవాదులను రెచ్చగొట్టి భారత్‌పై ఉసిగొల్పుతున్న పాకిస్థానే ఈ విషయంలో వెనక్కి తగ్గక పోవడం వెనక ఆర్మీ ప్రోద్బలం ఉందన్నారు. గతంలో భారత్‌తో పెట్టుకుని తూర్పు పాకిస్థాన్ గా ఉన్న బంగ్లాదేశు కోల్పోయింది. కార్గిల్ విషయంలో ఎదురుదెబ్బ చూసింది. ఆర్థికంగానూ నష్టపోయింది. ఇప్పుడూ అదే ధోరణిని కనబరిస్తే పీఓకేను స్వాధీనం చేసుకోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడరాదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు పాక్ బలోచిస్థాన్ రూపంలో తిరుగుబాటు-ఎదుర్కొంటోంది. ఏ క్షణంలోనైనా బలోచిస్థాన్ విముక్తి జరగొచ్చు. పాకిస్థాన్‌కు అఫ్గానిస్థాన్‌తోనూ గొడవలు ఉన్నాయని అంటున్నారు. భారత్‌తో నేరుగా తలపడలేని పాకిస్థాన్ ఓ వైపు ఫేక్‌న్యూస్‌ను ప్రచారం చేస్తోందని హెచ్చరించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పాక్‌ను దనుమాడాలని కూడా సూచిస్తున్నారు.

## పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, మే 10 :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మూడు రోజుల పాటు- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే రెండు లేదా మూడు డిగ్రీలు తక్కువ ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో పాటు- గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు(శ) పడతాయని సూచించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది.

## సరిహద్దు ఉద్రిక్తతలతో రైల్వే స్టేషన్ల భద్రత పెంపు

**హైదరాబాద్, మే 10 :** భారత్ - పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ వెల్లడించారు. ప్రయాణికుల భద్రతతో పాటు ఆస్తులపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని అన్నారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన సికింద్రాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసి వేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు- చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్‌వో శ్రీధర్ వెల్లడించారు.

## శంషాబాద్ పరిధిలో డ్రోన్ల నిషేధం

**హైదరాబాద్, మే 10 :** నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించారు. విమానాశ్రయానికి 10 కి.మీ. పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు- సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సీపీ తెలిపారు. డ్రోన్లపై నిషేధం జూన్ 9 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆకస్మిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. బాణసంచా పేలుళ్లను ఉగ్ర కార్యకలాపాలుగా తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు సహకరించాలని, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## నా సిందూరాన్ని దేశ రక్షణకు పంపుతున్నా



**ముంబై, మే 10 :** 'నా సిందూరాన్ని దేశ రక్షణ కోసం పంపుతున్నా' అంటూ నవ వధువు పెళ్లయిన మూడు రోజులకే భర్తను సరిహద్దుల్లోకి పంపి ఆదర్శంగా నిలుస్తోంది. ఇందుకు గర్విస్తున్నాని తెలిపింది. దేశం కన్నా తనకు మరేదీ ముఖ్యం కాదని తెలిపి ధీరత్వాన్ని చాటింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా పారా మిలిటరీ బలగాలకు సెలవులు రద్దయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన జవాను మనోజ్ పాటిల్‌కు.. బోర్డర్‌కు తిరిగి రావాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. అయితే మనోజ్‌కి ఈనెల 5నే వివాహం జరిగింది. పెళ్లయి వారం రోజులు కూడా గడవకముందే విధుల్లో చేరాల్సి రావడంతో భార్య యామిని, కుటు-ంబ సభ్యులు బాధను దిగమింగుకొని మనోజ్‌ను దేశ రక్షణ కోసం పంపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. అలాగే ఆమెను అంతా అభినందించారు.

# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్

**న్యూఢిల్లీ, మే 10:** దెబ్బకు దిమ్మ తిరిగింది. నడ్డి విరిగి..నడవలేని పరిస్థితుల్లో పాకిస్తాప్ కాళ్లబేరానికి వచ్చింది. నేరుగా భారత్ కాళ్లనే పట్టుకున్నా.. కాదనడంతో అమెరికాను ఆశ్రయించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పించింది. ఐదు రోజుల్లోనే పాక్ ఇక ముందుకు అడుగు వేయలేని దుస్థితికి చేరింది. భారత రక్షణ దళాల దెబ్బకు పాక్ కోలుకోలేని దెబ్బతింది. ఇక యుద్ధంకాదుకదా.. భారత సైన్యం ముందు నిలబడలేని దుస్థితికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధం వద్దంటూ కాళ్లావేళ్లా పడింది. మరోవైపు ప్రతీ ఉగ్రదాడిని యుద్ధచర్యగానే పరిగణిస్తామని శనివారం భారత్ చేసిన ప్రటకనతో వణికిపోయింది. మరోవైపు బలూచీస్థాన్ స్వతంత్రం ప్రకటించకుంది. ఈ క్రమంలో భారత్‌తో తలపడలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఇప్పటికే చేయాల్సిన నష్టం చేసిన భారత్ కూడా ...కాల్పుల విరమణకు సరేనంది. అయితే..షరతలు వర్తిస్తాయని తేల్చిచెప్పేసింది. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి జై శంకర్ కాల్పుల విరమణ ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. మొత్తంగా పహల్గామ్ ఊచకోత తరవాత..పివోకెలో ఉగ్ర శిబిరాలపై దాడితో పాక్ దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. తామేమీ తక్కువ తినలేదని బీరాలకు పోయి యుద్ధానికి కాలు దువ్వింది. గత బుధవారం భారత్ ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయగానే ..పాక్ యుద్ధానికే దిగింది. దీంతో భారత్ తన దెబ్బ ఎలావుంటుందో రుచి చూపింది. ఈ దెబ్బకే దిమ్మతిరిగిన పాక్ చేతులెత్తేసింది. ఇప్పటికే అక్కడి ఎంపిలు పాక్‌ను దమ్మెత్తి పోశారు. యుద్ధం చేయలేమని హెచ్చరించారు. వినకుండా ఆర్మీ చీఫ్ మునీర్ ఒత్తిడితో కాలుదువ్వి...కాళ్లు విరగొట్టుకుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్- పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడిం చారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. భారత్-పాకిస్తాన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.. కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి.. భారత్-పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించాం.. రాత్రంతా భారత్-పాకిస్థాన్‌లతో చర్చలు జరిగాయి.. రెండు దేశాలకు నా అభినందనలు.. తక్షణమే కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే పాక్ గతచరిత్ర చూస్తే ఏనాడు కాల్పుల విరమణను పాటించలేదు. ఇప్పుడు ఎలా అంగీకరిస్తారన్నది చూడాలి.

## ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్

మొదటి పేజీ తరువాయి


వెళ్తున్నాయి. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్- పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు- చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు- గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మరణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

# అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

### జయజయహే రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభం

### 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన

**హైదరాబాద్, మే 10:** నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియం వేదికగా పోటీలను ప్రారంభించారు. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం





ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత్, పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ 2025 పోటీలపై పడింది. ఈ క్రమంలో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవానికి సిఎం రేవంత్ రెడ్డి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. యుద్ధం నేపథ్యంలోనే దూరంగా ఉంటున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన డిన్నర్‌ను కూడా రద్దు చేసినట్టుగా తెలిసింది. ఇండో,- పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని, లేదా వాయిదా వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈనెల 31వ తేదీ వరకు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా ఈ పోటీలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు- చేస్తోంది. జూన్ 1వ తేదీన హైటె-క్స్‌లో గ్రాండ్ ఫినాలే జరుగనుండగా 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీ-ల్లో పాల్గొంటున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో కీలక ఉగ్రవాదులు హతం

### వివరాలు వెల్లడించిన రక్షణశాఖ వర్గాలు

**న్యూఢిల్లీ, మే 10:** ఆపరేషన్ సిందూర్‌లో జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే తోయిబా ఉగ్ర సంస్థలకు సంబంధించిన కీలక ఉగ్రవాదులను భారత ఆర్మీ మట్టుబెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మే 7వ తేదీ బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని లష్కరే తోయిబా, జైషేతోపాటు- తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దాడి చేసింది. భారత దాడుల్లో 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు- అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, చనిపోయిన వారిలో లష్కరే తోయిబా, జైషే ఉగ్రసంస్థల్లో కీలకంగా ఉన్న ముదస్సర్ ఖాదియన్ ఖాస్, హాఫీజ్ ముహమ్మద్ జమీల్, మొహమ్మద్ యూసుఫ్ అజార్, ఖలీద్ (అబు ఆకాషా), మొహమ్మద్ హసన్ ఖాన్ అనే ఐదుగురు ఉగ్రవాదులు ఉన్నారని వర్గాలు తెలిపాయి. ఇందులో మొహమ్మద్ యూసుఫ్ అజార్.. జైషే చీఫ్ మసూద్ అజార్ బావమరిది అని నివేదికలు వెల్లడించాయి. కాగా, ఈ దాడుల్లో మసూద్ ఇప్పటికే తన సోదరుడిత్ సహా 10 కుటు-ంబ సభ్యులు, నలుగురు సన్నిహితులను కోల్పోయాడు. ఈ విషయాన్ని అంగీకరిస్తూ లేఖ కూడా విడుదల చేశాడు. ఎయిర్ ఇండియా హైజాక్ సూత్రదారి తొలగించబడిన ఈ ఉగ్రవాదులు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలలోని అత్యంత ఉన్నత స్థాయి వ్యక్తులలో కొందరు, లష్కరే తోయిబా మరియు జైషే మొహమ్మద్ రెండింటితో బలమైన సంబంధాలు కలిగి ఉన్నారు.



ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# ఊచకోత కోయాలని ఇస్లాం చెప్పిందా?

- ఇస్లాం పేరుతో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్
- భారత్‌లో మత విద్వేషాలకు పాక్ కుట్ర
- పహల్గామ్ దాడికి భారత్ ధీటైన జవాబిస్తోంది
- ఉర్దూ జర్నలిస్టుల కార్యక్రమంలో ఓవైసీ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 10:** పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారతదేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్.. ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి పాక్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఒవైసీ పాల్గొన్నారు. భారత్‌ను మతప్రాతిపదికన విభజించాలని పాక్ ప్రయత్నిస్తోందని అన్నారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉంటున్నారని.. హిందూ, ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మా పూర్వీకులు తిరస్కరించారని ఓవైసీ అన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాకిస్థాన్.. ఆఫ్ఘానిస్థాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని, ఇరాన్ సరిహద్దుల్లో ఎందుకు బాంబులు వేస్తోందని, ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా? ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ మాటిమాటికి మజాక్ చేస్తోందని, పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ వెనక్కి తగ్గదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదన్నారు. భారత్‌లోని హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోందని, పహల్గామ్‌లో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని విమర్శించారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామని, పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అన్నారు. మాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. పాక్ దాడులపై భారత్ వెనక్కి తగ్గేది లేదని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, దానికి తగిన మూల్యం చెల్లిచుకుంటుందని ఒవైసీ అన్నారు. భారత జవానులకు మద్దతుగా మనమందరం ఉండాలని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. చచ్చే వరకు భారత భూమి కోసమే బ్రతకాలని ఎమోషనల్ అయ్యారు. ఈభూమ్మీద పుట్టడం మన అదృష్టమని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ జనాలను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని, దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఎంపీ అన్నారు. పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గదు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపే పాకిస్తాన్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు. అమ్మ కడుపులో నుండి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బ్రతకాలి' అని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.

# మేమెవరి జోలికి వెళ్లం

## మా జోలికి వస్తే మాత్రం వదిలి పెట్టం

### బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పోస్ట్



**ముంబై, మే 10 :** పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సైనికులకు సెల్యూట్ చేస్తూ దీనిపై స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఇమేజ్‌ను పంచుకున్న రణ్‌వీర్.. ఎవరి పనులు వాళ్లు చేసుకునే వారిని మేం ఇబ్బందిపెట్టం. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెట్టాలని మా జోలికి వస్తే మాత్రం వదిలిపెట్టం. మన సాయుధ దళాల ధైర్యానికి సెల్యూట్ అని రాసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోన్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌పై టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. చిరంజీవి, అల్లు అర్జున్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్, రితేశ్ దేశ్‌ముఖ్, నిమ్రత్ కౌర్‌లు సైనికుల సేవలను కొనియాడారు. మీ వెంటే మేమున్నామని సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేశారు. ఇక మరోవైపు రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. భారత ఆర్మీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో భారత్ – పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు రష్యా అండ

## రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ వెల్లడి



**మాస్కో,మే10:** ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ మద్దతు ఉంటుందని రష్యా మ-రోసారి స్పష్టం చేసింది. మునుపటి ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని తెలిపింది. ఈ క్రమంలో సంప్రదింపుల ప్రక్రియలో ఉన్న మిలిటరీ ఆర్డర్లను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. భిన్న రూపాల్లో ఉన్న ఉగ్రవాదంపై పోరాడుతున్న మనకు పూర్తి మద్దతు ఇస్తామని రష్యా హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. రష్యా విజయోత్సవాల్లో ఆయన భారత్ పరతినిధిగా పాల్గొన్నారు. పుతిన్‌నుకలిసి అభినందనలుతెలిపారు. మాస్కో పర్యటన ముగించుకొని భారత్‌కు బయలుదేరిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. మాస్కోలో నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో భారత్ తరఫున రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పాల్గొన్నారు. అనంతరం రష్యా రక్షణశాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గతంలో రూపొందించుకున్న నిబంధనలు, వరుస సంప్రదింపుల ద్వారా సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. సీమాంతర ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించడంపై రష్యాకు భారత్ ధన్యవాదాలు తెలిపింది.

# కాల్పుల విరమణపై అఖిలపక్షం

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు

## అన్ని విషయాలు సమగ్రంగా చర్చించాలి

## ప్రభుత్వానికి కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ, మే 10:** భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికి జరిగిన పరిణామాలను వివరించాలని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం గడిచిన 18 రోజులుగా జరిగిన పరిణామాలు, కలికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇకపోతే భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇదే ఒప్పందం రెండ్రోజుల ముందు జరిగి ఉంటే కొంత రక్తపాతాన్ని, కొన్ని జీవితాలను కాపాడిటనట్లయ్యేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు ఇరు దేశాల మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్స్ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు అంగీకరించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. దాడుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉపశమనం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ఉందని ఒమర్ అబ్దుల్లా అన్నారు. భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ యుద్ధం దిశగా అడుగులు పడుతుండటంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ మొదట చొరవ చూపించాలని, నాయకత్వ పాత్రను పోషించాలని అన్నారు. సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే భారత్ నిజమైన శక్తి అని చాటిచెప్పేందుకు ఇదే తగిన తరుణమని పేర్కొన్నారు. భారత్, పాక్ మధ్య పరస్పర దాడులపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫోన్ చేసి భారత్‌తో పెరిగిన ఉద్రికత్తలను తగ్గించుకోవాలని కోరిన నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉగ్రిత్తల విషయంలో ఒక దశదాటి జోక్యం చేసుకోలేమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారని, ఇప్పుడు మార్కో రూబియో సైతం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని కోరారని ముఫ్తీ తెలిపారు. నిలకడలేని అంతర్జాతీయ మద్దతు వైపు మొగ్గడానికి బదులు, ఉద్రిక్తతలు తొలగేందుకు భారత్ మొదటి అడుగు వేయాలని ఆమె సూచించారు.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

**హైదరాబాద్, మే 10 :** నగర శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి రెండు వాహనాలు కాలిపోయాయి. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు సజీవ దహనం కాగా మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు–చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...నగరంలోని బహదూర్ పూర్ తాడ్బన్, హెచ్‌బి కాలనీకి చెందిన వ్యాపారవేత్త దీపేష్ రితేష్ కుమార్ అగర్వాల్ కుమారుడు దీపేష్ అగర్వాల్ (23) తన స్నేహితులను కలిసి వస్తానని చెప్పి కారులో బయలుదేరాడు. విజయనగర్ కాలనీ విటిసికి చెందిన సంచయ్ మల్వాని (22), మాసాపేట్‌కు చెందిన ప్రియాన్ష మిట్టల్ (23)తో కలిసి వారు శంషాబాద్ వైపు నుండి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గండిచెరువు బ్రిడ్జి సమీపంలో ఔటర్‌పైకి రాగానే ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఆగి ఉన్న వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగాయి. దాంతో రెండు వాహనాలు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. కారు ఉన్న ముగ్గురిలో దీపేష్ అగర్వాల్, సంజయ్ మల్వాని అక్కడిక్కడే సజీవ దహనం కాగామరో స్నేహితుడి ప్రియాన్ష మిట్టల్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఎల్‌బినగర్ కామినేనికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే



మృతి చెందాడని ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పాక్ అరాచకాలకు మోడీ గట్టి సమాధానం

## బహీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

**హైదరాబాద్, మే 10 :** పాకిస్తాన్ చేసిన అరాచకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గట్టిగా సమాధానం చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి గట్టిగా భారత ఆర్మీ జవాబు చెప్పిందని అన్నారు. భారత సైనికులు ధైర్యంతో, సాహసంతో వీరోచితంగా పాకిస్తాన్‌లోని 9 ప్రాంతాల్లో ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలు, ఉగ్రవాదుల ఇండ్లను మట్టు–బెట్టారని చెప్పారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేస్తోందని అన్నారు. భారతదేశం మీద జరిగిన ఉగ్రవాదుల దాడికి గానూ పాకిస్తాన్ క్షమాపణ చెప్పాల్సింది పోయి.. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో, పౌర నివాసాలపై, సైనికులకు సంబంధించిన కేంద్రాలపై దాడులు చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా పోరాటం చేస్తున్న భారత సైనికులకు ఆత్మస్థయిర్యం, శక్తి, విజయం కలగాలని శనివారం బషీర్‌బాగ్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భారతదేశానికి మద్దతుగా భక్తులు నినాదలు చేశారు. జై శ్రీ రామ్.. జై రామ్ లక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్‌కి.. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేశ భద్రత కోసం పోరాడుతున్న యోధుల రక్షణకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని కిషన్‌రెడ్డి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది భారత పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చిచంపారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలని పాకిస్తాన్ కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. మన దేశ సమగ్రత, సమైక్యతను దెబ్బతీయాలని, దేశ అభివృద్ధిని అడ్డుకోవాలని పాకిస్తాన్ చాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. గతంలో భారత సైనికులు, పౌరులను కిరాతకంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు హత్యచేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో కూడా లుంబినీ పార్కు, కోఠిలోని గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ పరిసరాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరిపి చాలామందిని పొట్టనబెట్టు–కున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ అమాయకులైన ప్రజలపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మన దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా అందరూ ఏకమై ముక్తకంఠంతో పాకిస్తాన్ దుశ్చర్యలను ఖండిస్తున్నారని చెప్పారు. భారత సైనికులకు అండగా నిలబడ్డారని తెలిపారు. దేశ భద్రత కోసం పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లాలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక ర్యాలీలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత సైనికులకు మరింత ఆత్మ్థసైర్యం కల్పించేలా ప్రజలు సంఘీభావాన్ని తెలియజేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఈ యేడాది ముందుగానే రుతు పవనాలు

## 27న కేరళను తాకనున్న నైరుతి: ఐఎండి



**న్యూఢిల్లీ, మే 10 :** నైరుతి రుతుపవనాలు ఈసారి మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఐఎండీ శనివారం తెలిపింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక జులై 8 నాటికి భారత్ వ్యాప్తంగా విస్తరిస్తాయి. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1 లేదా ఆ తర్వాత రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. దీంతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. అయితే 2009లో నైరుతి రుతుపవనాలు మే 23నే ప్రవేశించాయి. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అంచనాల కంటే చాలా ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. సెప్టెంబరు 17న రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభమవుతుంది. ఆ తదుపరి నెల 15 నాటికి ఇది ముగుస్తుంది. ఈసారి వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదు అవుతుందని ఐఎండీ ఏప్రిల్ నెలలోనే తెలిపింది. సాధారణం కంటే తక్కువగా వర్షపాతం కురిసే ఎల్‌నినో పరిస్థితులు లేవని చెప్పింది. భారత్‌లో 52 శాతం నికర సాగు భూమికి వానలే ఆధారం. భారత్‌లోని వ్యవసాయ ఉత్పత్తిలో దీని నుంచి 40 శాతం దిగుబడి వస్తుంది. ఇండియాలో ఆహార భద్రతతో పాటు– ఆర్థిక స్థిరత్వానికి నైరుతి రుతు పవనాలది ప్రధాన పాత్ర. 'నాలుగు నెలల రుతుపవన కాలంలో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు– 87 సెంమీలో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశాం' అని అధికారులు అప్పట్లో ప్రకటించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా భారతదేశంలో దాదాపు 87 సెంమీ వర్షం పడుతుంది. దీనిని దీర్ఘకాలిక సగటు– అంటారు. ఈ సంవత్సరం మాత్రం మొత్తం వర్షపాతం 87 సెంమీలో 105 శాతం ఉంటు–ందని అంచనా వేశారు. అంటే 91.35 సెంమీ వర్షపాతం పడుతుందని అంచనా వేసినట్లు– లెక్క. దేశ వ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి నైరుతి రుతుపవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# జనావాసాలపై దాడులతో పాక్ కవ్వింపు

**ఢిల్లీ లక్ష్యంగా పాక్ క్షిపణి ప్రయోగం**
**హతాఫ్-2 మిస్సైల్‌ను అడ్డుకున్న భారత్**
**హర్యానాలోని సిర్సా వద్ద కూల్చివేత**
**శ్రీనగర్ ఎయిర్‌పోర్టుపైనా దాడికి యత్నం**



**న్యూఢిల్లీ, మే 10:** ఒక పక్క భారత దళాల ధాటికి విలవిలలాడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపిస్తూనే ఉంది. భారత్ పై మిస్సైళ్లతో దాడికి పాల్పడుతూ రెచ్చగొడుతోంది. జనావాసాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ రెచ్చొట్టే చర్యలకు దిగుతోంది. ఢిల్లీ, శ్రీనగర్‌తో పాటు, సరిహద్దు వెంబగి గ్రామాలపై దాడులకు తెగబడుతోంది. ఢిల్లీపై దాడి చేయడమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ డ్రోన్లను మన సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. మళ్ళీ క్షిపణులు ప్రయోగిస్తోంది. తాజాగా ఢిల్లీని టార్గెట్ చేసుకున్న పాక్.. శనివారం ఫతా 2 క్షిపణి ప్రయోగించింది. అయితే.. ఫతా 2 క్షిపణిని భారతదళాలు కూల్చేసాయి. హర్యానాలోని సిర్సా సమీపంలో భారత వైమానిక రక్షణ దళాలు ఆ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫతా 2 క్షిపణి ఉపరితలం నుండి ఉపరితలానికి 400 కిలోమీటర్ల రేంజ్ తో ఉంటుందని తెలుస్తుంది. శనివారం తెల్లవారుజామున, రావల్పిండి లోని నూర్ ఖాన్, పంజాబ్‌లోని చక్వాల్‌లోని మురిద్, షోర్కోట్‌లోని రఫీకితో సహా నాలుగు పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేసినట్లు సమాచారం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి జరిగినట్లు ఆ దేశ డైరెక్టర్ జనరల్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి వెల్లడించారు. ఎల్‌ఓసీ వెంబడి 26 డ్రోన్లు కనిపించాయని.. వీటిలో అనుమానిత సాయుధ డ్రోన్లు ఉన్నాయి. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపోరా, నగ్రోటా, జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, లాల్‌గఢ్ జట్టా, జైసల్మేర్, బార్మర్, భుజ్, కుర్బెట్ మరియు లఖీ నాలా ఉన్నాయి. విచారకరంగా, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి పాల్పడ్డట్టు ప్రభుత్వం తెలిపింది. భారత్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న పాకిస్థాన్ తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు- గుర్తించామన్నారు. శనివారం తెల్లవారుజామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళ్లు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భారత్ సరిహద్దుల్లో పాక్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని భారత సైన్యం వెల్లడించింది. అమృత్ సర్ ఖాసా కంటోన్మెంట్‌పైకి పాక్ డ్రోన్‌లు ప్రయోగించిందని, పాక్ డ్రోన్లను వచ్చినవి వచ్చినట్లు సమర్థంగా కూల్చివేశామని స్పష్టం చేసింది. సాధారణ పౌరులపై దాడులు ఆమోదనీయం కాదని పేర్కొంది. ఎలాంటి దాడులనైనా భారత సైన్యం దీటుగా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉందని బదులిచ్చింది.

## సంపాదకీయం




# గోబెల్స్ ప్రచారాన్ని నమ్ముకున్న పాక్!

భాత్‌తో పోరాడే శక్తి లేకపోవడంతో ఇప్పుడు పాకిస్థాన్ అబద్ధాల ప్రచారంలో దూసుకుపోతోంది. యుద్ధంలో తామేదో విజయం సాధించి, భారత్‌పై పైచేయి సాధించామని ప్రపంచానికి తెలియచేసి మార్కులు కొట్టేయాలన్న తపనలో అబద్ధాలను నమ్ముకుంది. అయితే పాక్ కుయుక్తులు తెలిసిన ప్రపంచదేశాలు వీటిని నమ్మకున్నా...ఫేక్ వార్తలను ప్రచారం చేస్తోంది. జర్మనీ నియంత వెంట ఉన్న గోబెల్స్‌ను మించి ప్రచారం చేస్తోంది. గోబెల్స్ ఉంటే ఆయన ఆశ్చర్య పోయేలా ప్రచారాలను పేలుస్తోంది. జన్మన్ నియంత హిట్లర్‌ను ముంచినట్లే ఇప్పుడు పాక్‌ను కూడా ఈ ప్రచారాలు ముంచడం ఖాయం. ఇకపోతే పాక్‌కు మద్దతుగా ఏ ఒక్కదేశం ముందుకు రావడం లేదు. అలాగే టర్కీ వచ్చినా దాని పాత్ర నామమాత్రమే. రెండురోజుల యుద్ధానికే పాక్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. అనవసరంగా తోక కాల్చుకున్నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి ఏర్పడింది. భారత్ ప్రతిదాడులతో పాక్ కకావికలం అవుతోంది. అసలు యుద్ధం ముందున్నది. దీంతో పాక్ దిమ్మతిరిగేలా భారత్ సమాధానం ఇవ్వనుంది. ఇవన్నీ పాక్ పాలకులకు, అక్కడి సైన్యానికి తెలుసు. అయితే ప్రజలను నమ్మించాలి. నమ్మించలేక పోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. క్రికెట్ ఓడిపోతేనే అక్కడి ప్రజలు రాళ్లతో కొడతారు. అలాంటి యుద్ధమంటే ఆషామాషీ కాదు. భారత్ బలగాలను దెబ్బ తీసామని, విమానాశ్రయాలు కూల్చామని, భారత్ యుద్ధవిమానాలను కూల్చేశామని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దీనిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది. దాయాది చేస్తున్న అసత్య ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొడు తున్నది. సామాజికమాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో నిజానిజాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. శుక్రవారం మీడియాలో పలు అంశాలు ప్రచారం కాగా, వాటిపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి, దేశప్రజలకు వాస్తవాలకు నివేదించింది. పాకిస్థాన్‌తోపాటు పలు మీడియా సంస్థలు కూడా పాత ఫొటోలు, వీడియోలను ప్రస్తుత యుద్ధానికి సంబంధించినవిగా చిత్రీకరిస్తూ అసత్యప్రచారానికి పూనుకుంటున్నది. దీనిపై భారత్ ముందస్తుగా స్పందిస్తూ వాస్తవాలు, పారదర్శకతతో తప్పుడు సమాచారానికి చెక్ పెడుతూనే ఉన్నది. కశ్మీర్‌లో కనీసం 3 భారతీయ జెట్‌లు కూలిపోయాయని చైనా డైలీ ప్రచారానికి పూనుకుంది. అయితే భారత్ దానిలో నిజానిజాలను బయట పెట్టింది. చైనా డైలీ ప్రచారం చేసిన చిత్రం 2019 నాటి ఒక సంఘటనకు సంబంధించిందని ఆధారాలతో బయటపెట్టింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరిట ఫేస్‌బుక్‌లో దుండగులు ఒక ఫేక్ అకౌంట్‌ను సైతం సృష్టించారు. పాకిస్థాన్ రహస్యంగా సైబర్ అటాక్స్ చేస్తున్నదని, పౌరులు మెస్‌జ్‌లను క్లిక్ చేయవద్దని తెలుపుతూ ఆ అకౌంట్‌లో ఒక పోస్టును పెట్టారు. భారత్ వెంటనే దీనిపై స్పందించింది. అజిత్ దోవల్‌కు ఫేస్‌బుక్ అకౌంటే లేదని తేల్చిచెప్పింది. నకిలీ ప్రొఫైల్ అని వెల్లడించింది. ముజఫరాబాద్‌లో సుఖోయ్ 30ఎంకేఐ విమానం కూలిపోయిందని, అందులో ఒక భారతీయ పైలట్ సజీవంగా ఉన్నాడని పాకిస్థాన్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారానికి పూనుకున్నాయి. అయితే అది అవాస్తమని భారత్ తేల్చింది. భారత వైమానిక దళానికి చెందిన ఈ సుఖోయ్ 2014 అక్టోబర్14 మహారాష్ట్రలోని పూణే- అహ్మద్‌నగర్ హైవే సమీపంలోని కుల్వాడి గ్రామంలోని ఉండ్రేవస్తి వద్ద కూలిపోయింది. దానిని తాజా యుద్ధానికి సంబంధించిందంటూ పాక్ వక్రీకరించింది. దానిని పాక్ ఆర్మీ కూల్చినట్లుగా ప్రాచారం చేసుకుంది. ఆ పోస్ట్‌ను షేర్ చేయవద్దని భారత్ స్పష్టంచేసింది. జమ్ము వైమానికదళ స్థావరంలో భారీగా వరుస పేలుళ్లు జరిగాయని కూడా పాక్ ప్రచారానికి తెరతీసింది. దాన్ని కూడా భారత్ తిప్పికొట్టింది. పాక్ ప్రచారం చేస్తున్న ఫొటో ఆగస్టు 2021లో కాబూల్ విమానాశ్రయంలో జరిగిన పేలుడుకు సంబంధించినదని బహిర్గతం చేసింది. తప్పుడు సమాచారంతో మోసపోవద్దని, కంటెంట్‌ను షేర్ చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పౌరులకు సూచించింది. జలంధర్‌లో జరిగిన డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే అది ఎప్పుడో పొలాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన వీడియో అని తేల్చింది. అదేవిధంగా పాకిస్థాన్ సైన్యం ఒక భారతీయ సైనికపోస్ట్‌ను నాశనం చేసిందని, అందుకు సంబంధించినదిగా చెప్తూ ఓ వీడియో వైరల్ చేసింది. అది అసత్యమని పీఐబీ గుర్తించింది. భారత సైన్యంలో 20 రాజ్ బెటాలియన్ అనే యూనిట్ లేదని, ఆ వీడియో ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రచారం చేస్తున్నారని తెలిపింది. భారతదేశంపై పాకిస్థాన్ ప్రతీకారంగా క్షిపణి దాడి చేసిందనే సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొడుతున్నది. అయితే అది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. షేర్ చేసిన వీడియో 2020 సంవత్సరంలో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించినదని తేల్చిచెప్పింది. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఫిదాయిన్ దాడి జరిగిందనేది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. సైనిక సిబ్బంది (సీవోఏఎస్) చీఫ్ జనరల్ వీకే నారాయణ్, నార్తర్న్ కమాండ్ ఆర్మీ అధికారికి సైనిక సంసిద్ధతకు సంబంధించి ఒక రహస్య లేఖను పంపారనేదిని అబద్ధమని, జనరల్ వీకే నారాయణ్ సీవోఏఎస్ కాదని, ఆ లేఖ పూర్తిగా నకిలీదని పీఐబీ స్పష్టంచేసింది. భారత సైన్యం అమృత్‌సర్‌లోని సొంత పౌరులపై దాడి చేయడానికి అంబాలా ఎయిర్‌బేస్‌ను ఉపయోగించుకుందని కూడా పాకిస్థాన్ సోషల్‌మీడియాలో అసత్యప్రచారం చేసింది. ఇది పూర్తిగా అవాస్తవమంటూ పీఐబీ తెలిపింది. భారతదేశంలోని విమానాశ్రయాల్లోకి ప్రయాణికులను నిషేధించారని కూడా ఒక పోస్ట్ వైరల్‌గా మారింది. ఆ నకిలీ కథనాన్ని పీఐబీ ఖండించింది. అసత్య ప్రచారాలు, వైరల్ అవుతున్న చిత్రాలు, వీడియోలకు సంబంధించిన వాస్తవాలను ఎప్పకప్పుడు రట్టు- చేస్తూ పాక్, దాని అనుకూల శక్తుల ప్రచారానికి అడ్డుకట్ట వేస్తున్నది. ఇలాటి ప్రచారాలతో సొంత ప్రజలను ఎంతకాలం నమ్మిస్తారన్నది చూడాలి. యుద్ధంలో తెగువ చూపే ధైర్యం లేక జనావాసాల్లో దాడులకు తెగబడుతున్న పాక్‌ను భారత సైన్యం తిప్పికొడుతోంది.

# కాల్పుల విరమణకు అంగీకారం

**శాంతికి ఎప్పుడూ పాక్ కట్టుబడి ఉంటుంది**
**అమెరికాను కాళ్లావేళ్లా పడ్డ పాక్ ప్రభుత్వం**
**చివరకు శాంతి వచనాలు ప్రకటించిన పాక్ మంత్రి దార్**

**ఇస్లామాబాద్, మే 10:** కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించినట్టు పాక్ ప్రకటించింది. తక్షణం కాల్పులను విరమించేందుకు భారత్ కూడా అంగీకరించిందని పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ పేర్కొన్నారు. పాక్, భారత్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, భద్రతకు పాక్ ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంది. తన సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడకుండా శాంతిస్థాపనకు ప్రయత్నిస్తుందని ఎక్స్ వేదికగా విదేశాంగ మంత్రి ఓ పోస్టు పెట్టారు. శనివారం వరకూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయి ఉద్రికత్తలు నెలకొన్న విషయం తెలిసిందే. మూడు రోజుల నుంచీ పాక్ మిసైళ్లను ధ్వంసం చేస్తున్న భారత్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇకపై జరిగే ప్రతి ఉగ్రవాద చర్యను యుద్ధ చర్యగా భావిస్తామని భారత వర్గాలు పేర్కొనడం ఒక్కసారిగా పరిస్థితిని మార్చేసింది. భారత్ భారీ ఆపరేషన్‌కు సిద్ధమవుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. అయితే, యుద్ధం తప్పదని అనుకుంటున్న తరుణంలో భారత్, పాక్ యుద్ధ ప్రకటనకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు పేర్కొనడం ఆ వెంటనే పాక్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు క్రమంగా యుద్ధం దిశగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరు ప్రాంతాల్లో దాడులు కొనసాగుతుండగా, సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో యుద్ధ వాతావరణం పెరుగుతోంది. ఇదే సయమంలో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో మాట్లాడుతూ, భారతదేశం తన దాడుల చర్యను ఆపితే, పాకిస్తాన్ కూడా అదే చేస్తుందన్నారు. ఈ ప్రకటన, పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చకుండా సంయమనం పాటించాలనే సంకేతాన్ని ఇస్తుందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం భారత్ పాకిస్తాన్‌లోని మూడు కీలక వైమానిక స్థావరాలపై దాడులు చేసింది. ఈ స్థావరాలు షోర్కోట్‌లోని రఫీకీ ఎయిర్‌బేస్, చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్, రావల్పిండిలోని నూర్ ఖాన్ (చక్లాలా) ఎయిర్‌బేస్‌లు ఉన్నాయి. భారత్ గగనతల-ఉపరితల క్షిపణులతో ఈ దాడులు చేసింది. దీంతో పెద్ద ఎత్తున నష్టం ఏర్పడింది. అయినప్పటికీ పాకిస్తాన్ మాత్రం తమ వైమానిక దళ ఆస్తులు సురక్షితంగా ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తోంది. ఎంత నష్టం జరిగినా కూడా పాకిస్తాన్ మాత్రం అదే పాట పాడుతోంది. మరోవైపు పాకిస్తాన్ తీరును చూసి టర్కీ సహా ఏ దేశాలు కూడా సపోర్ట్ చేయడం లేదు. చైనా పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నా కూడా ప్రస్తుతం మాత్రం పాకిస్తాన్ ఏకాకిగా మారిపోయింది. ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్న నేపథ్యంలో తమ దేశాన్ని కాపాడాలని పాకిస్తాన్.. అగ్రరాజ్యమైన అమెరికాను వేడుకుంది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో పాకిస్తాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇండియాతో శాంతి ఒప్పందం కుదుర్చాలని వేడుకున్నారు. ట్రంప్ కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. కానీ బేరసారాల కోసం వెళ్లిన పాకిస్తాన్‌కు ఇక్కడ కూడా ఎదురుదెబ్బ తగిలింది. ఈ విషయంలో మాత్రం పాకిస్తాన్ వెనక్కి తగ్గాలని మార్కో రూబియో సూచించారు. ఈ క్రమంలో భారతదేశం తన దాడుల చర్యను ఆపేస్తే, మేము కూడా ఆపేస్తామని పాక్ ఉపప్రధాని అన్నారు.

# పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరు


**తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్**



**గౌహతి, మే 10:** పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడాన్నికాంగ్రెస్ తప్పు పట్టింది. భారత్ అభ్యంతరం చెబుతున్నా పట్టించుకోకుండా రుణం ఇవ్వడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో గట్టిగా బదులు తీర్చుకుంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఇలాంటి తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ స్పందించారు. పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడం షాక్‌కు గురి చేసిందన్నారు. 'పహల్గాం దాడి తర్వాత ÷ూఉ 1 బిలియన్ డాలర్ల రుణం ఆమోదించడం షాకింగ్‌గా అనిపించడంతో పాటు నిరాశకు గురిచేసింది. ఈ రుణం పాకిస్థాన్‌లో శాశ్వత సైనిక పాలనకు దారితీసేందుకే దోహదం చేస్తుంది' అని గౌరవ్ గొగొయ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ఈ విషయంపై స్పందించారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణానికి వ్యతిరేకంగా భారత్ ఓటు- వేయాలని ఏప్రిల్ 29న కాంగ్రెస్ డిమాండ్ చేసిందన్నారు. కానీ, భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఓటింగ్‌లో పాల్గొని వ్యతిరేకంగా ఓటు- వేస్తే బలమైన సందేశం వెళ్లేదన్నారు. ఈ నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నాయకులు జైరాం రమేశ్, పవన్ ఖేరాలకు కౌంటర్ ఇచ్చారు. వీరు పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి బెయిలౌట్‌పై ప్రచారంలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. తప్పుడు సమాచారంతో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

# కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి


**రాత్రంతా వారితో చర్చలు జరిపి ఒప్పించారు**
**సోషల్ మీడియాలో డోనాల్డం ట్రంప్ పోస్ట్**



**వాషింగ్టన్, మే 10 :** భారత్- పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ డోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు- చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

# సరిహద్దు ఉద్రిక్తతలతో విద్యార్థుల ఆందోళన


**కేంద్రమంత్రి బండి చొరవతో స్వస్థలాలకు పయనం**



**శ్రీనగర్, మే 10 :** భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్శిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com
ఆదివారం
11 మే 2025





# మధ్యవర్తిత్వం, రాజీమార్గంతో వివాదాల పరిష్కారం

## తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్









**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** మధ్యవర్తిత్వం, రాజీమార్గం ద్వారా వివాదాలను పరిష్కరించేందుకు కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్ల ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పి డివి శ్రీనివాస్ రావు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ – ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, జిల్లా న్యాయమూర్తులు యువరాజా, అనంతలక్ష్మి, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ లతో కలిసి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ నిర్వహణపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో మధ్యవర్తిత్వ కేంద్రం కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. కేరళలో ప్రారంభమైన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లలో చిన్నచిన్న కుటుంబ, ఇతర తగాదాలను కమ్యూనిటీ పెద్దల సమక్షంలో చర్చించుకుని రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడంతో ఇరు పార్టీలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రాబోయే తరం ఎలాంటి తగాదాలు లేకుండా తయారు కావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సయోధ్యతో రాజీమార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడంతో పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలలో కేసులు తగ్గుతాయని అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కూడా వేరువేరు కమ్యూనిటీ కేంద్రాల ద్వారా సమస్యలను పరిష్కరిస్తూ విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిజామాబాద్, కామారెడ్డి లలో ఈ సెంటర్లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 10వ మధ్యవర్తిత్వ కేంద్రం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. 2023లో కమ్యూనిటీ మీడియేషన్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రస్తుత కాలంలో వివాహ బంధాల మధ్య మనస్పర్ధలు ఏర్పడి విచ్ఛిన్నం అవుతున్నాయని, ఈ సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చిన్న చిన్న వివాదాలతో నెలకొన్న సమస్యలను మీడియేషన్ సెంటర్ ద్వారా పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మీడియేషన్ సెంటర్ ద్వారా సమస్యల పరిష్కారానికి పలు కమ్యూనిటీల సభ్యులు ముందుకు రావాలని, వారికి 3 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి మాట్లాడుతూ రాజీ చేసుకుని తగాదాలను పరిష్కరించుకోవడం వలన పెద్ద గొడవల నుండి బయటపడవచ్చు అని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో కొనసాగుతున్న కేంద్రాల ద్వారా అనేక సమస్యలు పరిష్కరించబడుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రం కొరకు జిల్లాలోని 17 మండలాలలో 180 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కోర్టు ఖర్చుల గురించి కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటివి లేకుండా ఉచిత న్యాయం అందే విధంగా 2023లో తీసుకువచ్చిన మీడియేషన్ చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గిరిజనుల కోసం జల్ జంగల్ జమీన్ లక్ష్యంగా కొమురం భీం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని, భీమ్ స్ఫూర్తిగా జిల్లాలో మీడియేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మధ్యవర్తిత్వ కేంద్రం ప్రజా ప్రయోజనకరంగా ఉంటుందని, ఇప్పటికే గిరిజనులలో రాయి సెంటర్లు అందుబాటులో ఉన్నాయని, వాటికి కొనసాగింపుగా మధ్యవర్తిత్వ కేంద్రాలు పని చేయడం మరింత ఉపయోగకరమని తెలిపారు. స్వయం సహాయక సంఘాలలో ఇప్పటికే మధ్యవర్తిత్వం కొనసాగుతుందని, జిల్లాలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులలో అనేక మంది వయోవృద్ధులు తమను పిల్లలు చూడడం లేదని దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారి కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలు ఎంతగానో పని చేస్తాయని తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ – ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన సంస్కృతిలో ఎన్నో సంవత్సరాలనుండి సర్ మేడిలు, మేడిలు, రాయి సెంటర్లు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పెరుగుతున్న అవసరాల దృష్ట్యా మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఎస్. పి. మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేంద్రాలకు సహాయ సహకారాల కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ఉచిత సేవలు అందించడం జరుగుతుందని, సమస్య పరిష్కారానికి తక్కువ సమయం పడుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జడ్జ్ కు జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికి వందేమాతర గీతాలాపన అనంతరం పహల్గాం బాధితులకు నివాళిగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ యువ రాజా, జూనియర్ సివిల్ జడ్జిలు అనంతలక్ష్మి, అజయ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఎస్డిపిఓ చిత్తరంజన్, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కోసం సర్వే

**ఉద్యమ కెరటం, జైనూర్ :** పారా పంచాయతీ పార శుకుడుపెల్లిలో గిరి వికాసం పథకం ద్వారా రైతుల వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ శాఖ ఎస్సీ శేషారావు రాథోడ్, అధికారులు సర్వేలు చేశారని మాజీ సర్పంచ్ మేస్రం గోవిందరావు శనివారం తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు రైతుల వ్యవసాయ బావులను పరిశీలించి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సర్వేలు చేశారని ఆయన పేర్కొన్నారు. సర్వే చేసిన వారిలో ఆశీర్వాద్ విద్యుత్ శాఖ ఎస్ ఈ శేషరావు రాథోడ్, ఏ డి ఈ శ్రీనివాస్, జై నూర్ ఇన్చార్జి ఏఈ సాయి కృష్ణ విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారని పర పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ మేస్రం గోవిందరావు తెలిపారు. రైతులు వ్యవసాయం సాగు చేసుకోవడానికి తమ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా జరిగితే ఎంతో ఉపయోగకరంగా రైతులకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# వీరజవాన్లకు బీఆర్ఎస్ ఘన నివాళి



**ఉద్యమ కెరటం, బెజ్జూర్ :** మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో భారత అమర జవాన్లకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని మహాత్మా గాంధీ చౌరస్తా నుండి మజీద్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్ పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన మురళి నాయక్, సచిన్ యాదవ్ అమరత్వాన్ని స్మరిస్తూ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. భారత అమరజవాళ్ళు జోహార్ అంటూ బెజ్జూర్ మండల కేంద్రం మారుమోగింది. అనంతరం మజీద్ చౌరస్తా వద్ద వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బూస సారాయ మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం భారత్ పాక్ యుద్ధంలో అసువులు బాసిన అమరుల జ్ఞాపకార్థం వారి ఆత్మ శాంతి కోసం మండలంలోని నాయకులందరూ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. భారతదేశంలో తలుచుకుంటే పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే కనిపించదని తెలిపిన ఆయన దుశ్చర్యలు మానుకోవాలన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోసే పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఆపాలని హితవు పలికారు. భారత్ తన మిస్సైల్ తో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలనే టార్గెట్ చేయగా శత్రుదేశం భారత ప్రజల మీద నిస్సయిల మీద దాడి చేసి యుద్ధాన్ని పెంచే మద్దుచర్య చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాజా మొయినుద్దీన్, యూత్ మండల్ అధ్యక్షులు దుర్గం తిరుపతి, మైనారిటీ మండల అధ్యక్షులు యాహుబ్, నాయకులు సూర్ల ఇస్తారి, జటారి బక్కన్న, హరీష్, దేవన్న, తొడసం శంకర్, కుమ్మరి శ్రీనివాస్, దుర్గం డోనాజి, కుమ్మరి లక్ష్మణ్, వయ్యాడ సంతోష్, రామగిరి సత్తయ్య, చిప్పకుర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇవ్వకండి

## నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రులపై కేసులు..: ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మొదటిసారి మైనర్లు పట్టుబడితే కౌన్సెలింగ్ ఇస్తామని, నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పి ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. గతవారం జిల్లా వ్యాప్తంగా 295 మైనర్లు నడిపిన వాహనాలను వారం రోజులపాటు తాత్కాలికంగా జప్తు చేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ఇచ్చి వాహనాలు అందజేశారు. శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేర్వేరుగా కేసులు నమోదు చేశారని వివరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి అవుతున్నారని, అదేవిధంగా ప్రమాదాలకు గురి చేస్తున్నారని విషయాన్ని గమనించి తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా ఉండాలని సూచించారు. మైనర్లు అర్హత వచ్చేంతవరకు వాహన లైసెన్స్ ను పొందిన తర్వాత వాహనాలు నడపాలని లేనియెడల తల్లిదండ్రులపై అనవసరంగా కేసులు నమోదు అవుతున్నాయనే విషయాన్ని గ్రహించాలని సూచించారు.

# ఫేక్ఐడీతో మహిళకు వేధింపులు

## పంజాబ్‌కు చెందిన వ్యక్తి అరెస్టు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** సోషల్ మీడియాలో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి, మహిళను లైగింక వేధింపులకు గురి చేసిన పంజాబ్ కు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ శనివారం విలేకరుల తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహిళ బంధువులు పంజాబ్‌లో నివసిస్తున్నారు. కొన్ని అవసరాలు నిమిత్తం అమృత్సర్ కు చెందిన ఒక అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్ అనే వ్యక్తిని సంప్రదించగా, అసిస్టెంట్ ట్రెజరర్ నిరాకరించిన కారణంగా అతనిని మహిళ తరపు బంధువులు విజిలెన్స్ అధికారులకు పట్టించారు. ఈ కారణంగా వారిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా మునీష్ కుమార్ ఆదిలాబాద్ కు చెందిన మహిళ పేరిట ఫేక్ ఫేస్‌బుక్ఐడీ క్రియేట్ చేసి,మహిళ చిత్రాలను మార్ఫింగ్ చేసి, లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో నిందితున్ని గుర్తించి అమృత్‌సర్‌నుండి మునీష్ కుమార్ ఆదిలాబాద్ కు తీసుకువచ్చి ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు.

# ఆర్మీ జవాన్‌కు వీరతిలకం



**ఉద్యమ కెరటం, తాండూర్:** జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో భారత జవాన్ గా విధులు నిర్వహిస్తున్న తాండూర్ మండల నివాసి పుప్పాల లక్ష్మణ్ ఇటీవల సెలవులపై ఇంటికి వచ్చి, ఆర్మీ పిలుపుమేరకు విధుల్లో చేరడానికి వెళ్తుండగా, బీజేపీ నాయకులు ఆయనకు శనివారం సన్మానించి, వీరతిలకం దిద్దారు. పాకిస్తాన్ ఉగ్రమూకల అంతం కొరకు భారత ఆర్మీ నిరంతరంగా కృషి చేస్తుందని, ఇందులో జవాన్ ల పాత్ర కీలకమని అన్నారు. ఆర్మీకి దేశ పౌరులంతా కూడా అండగా నిలబడాలని కోరారు. భారత ఆర్మీ జవాన్ ల కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు తుకారం, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, కోమండ్ల శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు పుప్పాల మోహన్, మురళి,శోభన్,బానేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్లకు సంఘీభావ ర్యాలీ



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం గ్రౌండ్ లో వాకింగ్ చేస్తున్న వాకర్స్ ఆర్మీ జవాన్లకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారతదేశం పాకిస్తాన్ మధ్య జరుగుతున్న మెరుపు దాడికి అమరుడైన మురళి నాయక్ కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com



# బీజేపీ మండల అధ్యక్ష పదవి ఎవరికి?

## అధ్యక్ష పదవి పై పలువురు నాయకుల ఆశలు



**ఉద్యమ కెరటం , గంభీరావు పేట:** గంభీరావుపేట మండల బీజేపీ మండల అధ్యక్ష పదవి ఎవరికీ ఇస్తారోనని మండలంలోని బీజేపీ నాయకుల కార్యకర్తల మధ్య జోరుగా చర్చ జరుగుతుంది. గంభీరావు పేట మండలంలో మొదటి నుంచే బీజేపీ పార్టీ లో చాలా సీనియర్ నాయకులు ఎన్నో ఏండ్ల నుంచి ఒకే పార్టీ లో కొనసాగుతు బీజేపీ పార్టీ కి సేవలు అందిస్తూ వస్తున్నారు. మరి ఇప్పుడు బీజేపీ మండల అధ్యక్ష పదవి కి మండలం నుంచి పలువురు యాక్టీవ్ కార్యకర్తలు ఆశలు పెట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వేములవాడ నియోజక వర్గంలో పద్మశాలి, ఎల్లారెడ్డిపేట మండలంలో రెడ్డి వర్గానికి, ముస్తాబాద్ మండలంలో ఎస్సీ వర్గానికి, వీర్నాపల్లి మండలంలో ఎస్టీ వర్గానికి చెందిన బీజేపీ కార్యకర్తలకు మండల అధ్యక్ష పదవి దక్కింది . ఐతే గంభీరావు పేట మండలానికి బీసీ వర్గానికి చెందిన కార్యకర్త కి అధ్యక్ష పదవి ఇస్తారా...? లేదా వేరే వర్గానికి చెందిన వారికీ అధ్యక్ష పదవి ఇస్తారా.. ? అని పలువురు నాయకులు గుసగుస లాడుతున్నారు. బీజేపీ మండల అధ్యక్ష పదవి పార్టీ కోసం సేవలు చేసే వారికీ ఇస్తే పార్టీ మండలంలో ఇంకా అభివృద్ధి చెందుతదని పలువురు అంటున్నారు. పార్టీ కోసం పని చేసే ,యాక్టీవ్ గా ఉన్న నాయకులకు పార్టీ కి సేవ చేసే అవకాశం ఇవ్వాలని పలువురు బీజేపీ నాయకులు కోరుతున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఎవరనేది రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తారా...?మరి ఇంకా సమయం పడుతుందా...? వేచి చూద్దాం.



# నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరుమార్చుకోవాలి

ఏజెంట్ల చేతిలో మోసపోయిన పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి

ఈ ఏడాది 17 కేసుల్లో 22 మంది అరెస్టు.. సయ్యద్ అశ్వకు రిమాండ్

ఎస్పీ మహేశ్ బీ గితే

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీర్చుకోవాలని, లేదంటే కఠిన చర్యలుంటాయని ఎస్పీ మహేశ్ బీ గితే హెచ్చరించారు. శుక్రవారం తంగళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజమాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు చెందిన సయ్యద్ అశ్వకు అనే గల్ఫ్ ఏజెంట్ సిరిసిల్ల జిల్లాకు చెందిన 23మందికి అజర్ బైజాన్ దేశంలో కంపెనీ వీసా, మంచి జీవితం ఉంటుందని మాయమాటలు చెప్పి రూ.80 లక్షలు తీసుకొని విజిట్ వీసాపై పంపించి మోసం చేశాడు. తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామనికి చెందిన పంజా వేణు, తండ్రి మల్లయ్య అనే వ్యక్తి సయ్యద్ అశ్వకుపై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులిచ్చి మోసపోవద్దని, ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారు తమవైఖరి మార్చుకోకపోతే కఠినచర్యలు తప్పవన్నారు. జిల్లాలో గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుంచి ఉపాధి కోసం వెళ్లే వారి వద్ద నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని, నకిలీ వీసాలిచ్చి, పాస్ పోర్ట్ లు దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ ఏజెంట్లపై జిలాల్లో ఈ సంవత్సరం 17 కేసులలో 22 మందిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని, గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలన్నారు. వారి ద్వారానే వీసాలు పొందాల్సిందిగా సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ ఉన్న ఏజెంట్ల వివరాలు తెలుసుకునేందుకు, నకిలీ గల్ఫ్ ఎజెంట్ల వివరాలు తెలియజేయడానికి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ 8712656411 నెంబర్ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించాలని సూచించారు.

# పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** ఈ నెల13న పాలిసెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పాలిసెట్ నిర్వహణ పై ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులకు జిల్లాలో ఈ నెల 13 వ తేదీన ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు టీజీ పాలిసెట్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 2136 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం 7 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కేంద్రంలో సీ సీ కెమెరా తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రశ్నా పత్రాల తరలింపు అవసరమైన బందోబస్తు కల్పించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద కరెంట్ కోతలు ఉండవద్దని, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకేట్లతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సెస్, వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి, జిల్లా వైద్యాధికారి డా.రజిత, సిరిసిల్ల తహసీల్దార్ మహేశ్, సెస్, ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్క్రాప్ దుకాణాలపై ఆకస్మిక దాడులు

- 35 బృందాలతో జిల్లాలోని 10 మండలాల్లో సోదాలు
- భారీ ఎత్తున లభ్యమైన రాగి, వాహనాలు, మోటర్లు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో జిల్లాలు ఏకకాలంలో 35 బృందాలతో పది మండలాలలో స్క్రాప్ దుకాణాలపై మూకుమ్మడిగా తనిఖీల నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దొంగతనం కాబడ్డ వస్తువులను స్క్రాప్ దుకాణాలు ఎలాంటి పరిస్థితుల్లోనూ కొనవద్దని కొన్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడా, గుడిహత్నూర్, నేరడిగొండ నార్నూర్ బోథ్ ఏకకాలంలో స్క్రాప్ దుకాణాలలో జిల్లా పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 13 స్క్రాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమైనట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. లభ్యమైన షాపులపై ఆయా పోలీస్ స్టేషన్ల నందు కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దొంగలించిన బడ్డ సరుకును వస్తువులను వాహనాలను రాగి లాంటి లోహాలను కొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజల రక్షణకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుంది

జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు

బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ టౌన్ :** దేశ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ నేపథ్యంలో జిల్లాలో నిఘా పెంచడం జరిగిందని, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రధాన బస్టాండ్ లు, రైల్వే స్టేషన్, ప్రధాన రహదారులలో, రద్దీ ప్రాంతాలలో, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీమ్ తో, ప్రత్యేక బలగాలతో ముమ్మర తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని బస్టాండ్లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉదయం, సాయంత్రం వాహనాల తనిఖీ, అనుమానస్పద వ్యక్తులను గుర్తించి, విచారించటం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు కనపడిన వెంటనే 100 నెంబర్ కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలి. ప్రజల సహకారం వల్లే సమాజాన్ని మరింత భద్రమైనదిగా తీర్చిదిద్దగలమన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని, దేశ భద్రత, సున్నితమైన అంశాలపై పోస్ట్ చేసే ముందు జాగ్రత వహించాలని, అనాధారిత సమాచారాన్ని సోషల్ మీడియా గ్రూప్ లలో ఫర్వార్డ్ చేయవద్దని, పోలీస్ శాఖ, ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్నే నమ్మాలని ఎస్పీ పేర్కొన్నారు.



# ఆరోగ్యం కోసం నడక



అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలు

విన్నూతంగా నడక పోటీలు

**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల సంధర్భంగా పాత బెల్లంపల్లిలోని నీలగిరి వనం లో శనివారం ఐదు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. "వనంలో మనం- ఆరోగ్యం కోసం నడక" అనే పిలుపుతో అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాగిన ఈ పోటీలను కాగజ్ నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య నడక పోటీలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. ఈ నడక పోటీలకు పాత బెల్లంపల్లి,బెల్లంపల్లి, సోమగూడెం ప్రాంతాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నడక పోటీలలో ఎస్ కిరణ్ (ప్రథమ), సిహెచ్ అఖిల్ (ద్వితీయ), జంపం తిరుపతి (తృతీయ) విజేతలుగా నిలిచారు. పోటీల్లో ప్లాంటేషన్ మేనేజర్లు వి.సునీత (బెల్లంపల్లి రేంజ్), గోగు సురేష్ కుమార్ (మంచిర్యాల రేంజ్),ఎడ్ల లక్ష్మణ్(కాగజ్ నగర్ రేంజ్), డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జె నరేష్,పాత బెల్లంపల్లి మాజీ సర్పంచ్ జయ రామస్వామి, స్థానిక పెద్దలు కందుల సదానందం, మేకల పవన్, రాజు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన సిరిసిల్ల ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

రూ.60 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** మరో అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. రూ.60 వేలు లంచం తీసుకుంటూ సిరిసిల్ల ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలోని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అర్రం రెడ్డి అమరేందర్ రెడ్డిని కరీంనగర్‌లోని తన నివాసంలో లంచం తీసుకుంటుండగా శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకటాపూర్ మండలం అవునూరు మరియు అగ్రారాం గ్రామాల మధ్య చెక్ డ్యామ్ నిర్మాణం కోసం కాంట్రాక్ట్ పనికి సంబంధించిన రూ.50 లక్షల బిల్లును మంజూరు చేసేందుకు రూ.60 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించగా.. అధికారుల సలహా మేరకు బాధితుడు లంచం ఇస్తుండగా అమరేందర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# అమర జవాన్ మురళికి ఘన నివాళి

**ఉద్యమ కెరటం, కోనరావుపేట:** కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నిమ్మపల్లి గ్రామస్తులు పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లంబాడిలా ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్ నాయక్, నాయకులు ఎండీ అజీమ్ పాషా, భాశెట్టి నాగరాజు, వాల్య నాయక్, గూడూరి నరహరి, దొంతరవేణి శ్రీనివాస్, మల్యాల మనోజ్ కుమార్, అవుదుత శ్రీధర్, రాజు నాయక్, మధుకర్, ఎలగందుల లవణ్ కుమార్, దప్పుల సంతోష్, ఇస్లావత్ రాజు, మోహన్, భూపతి, పంతుల్, ఎల్లయ్య, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం.. రక్షతి రక్షితః
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY
www.udyamakeratam.com
ఆదివారం
11 మే 2025




# ఈ సారు.. ఇక మారరు?!


కలెక్టరేట్‌కు విద్యార్థులు వచ్చిన ఆటోలు ఇవే

## తీరు మారని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్

- తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని చెప్పాలని విద్యార్థులపై ఒత్తిడి
- తనకు క్యారెక్టర్‌సర్టిఫికెట్‌ఇస్తూ లేఖ ఇవ్వాలని విద్యార్థులకు హుకుం
- లేఖలు ఇస్తేనే హాల్‌టికెట్‌ఇస్తానని విద్యార్థులకు తిరకాసు
- అనుకూలంగా లేఖ ఇవ్వని వారిపై కక్షసాధింపు చర్యలు
- లేఖలు ఇచ్చిన విద్యార్థులను మూడు ఆటోల్లో కలెక్టరేట్ తీసుకెళ్లి వివరణ
- ఏకంగా కలెక్టర్‌నే బోల్తా కొట్టించేందుకు పథకం
- ఆర్మీ జవాన్ భార్యను హేళన చేసిన ప్రిన్సిపాల్

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్‌ప్రైవేట్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తీరు మారడం లేదు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. శనివారం హాల్‌టికెట్లు ఇవ్వడానికి చివరి తేదీ కావడంతో విద్యార్థులకు తిరకాసు పెట్టారు. హాల్ టికెట్లు ఇవ్వాలంటే, తాను చెప్పినట్లుగా లిఖితపూర్వకంగా యాజమాన్యానికి, తనకు అనుకూలంగా లేఖలు ఇవ్వాలని ఒత్తిడికి గురిచేశారు. కొందరు లేఖలు రాసి ఇవ్వడానికి నిరాకరించారు. ఆయనకు అనుకూలంగా లేఖలు రాసి ఇచ్చిన కొంత మంది విద్యార్థులను వివరణ ఇచ్చేందుకు సొంత ఖర్చులతో ఆటోలలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. శనివారం సెలవు దినం కావడంతో, కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులతో బలవంతంగా వినతి పత్రం అందజేసినట్లు తెలిసింది. ఏ విద్యార్థులు అయితే యాజమాన్యానికి, ప్రిన్సిపాల్ కు అనుకూలంగా లేఖలు రాసిన విద్యార్థులకే హాల్ టికెట్లు కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనే అందజేసినట్లు కళాశాల విద్యార్థులు తెలిపారు.


శనివారం కళాశాలలో విద్యార్థులకు హాల్ టికెట్ల అందజేత

## అనుకూలంగా లేఖలు ఇవ్వని వారిపై వివక్ష..!

బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం అక్రమంగా అదనంగా వసూలు చేస్తున్న ఫీజుల విషయాన్ని ప్రశ్నించిన విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. కాగా, కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్, యాజమాన్యానికి అనుకూలంగా లేఖలు ఇవ్వకుంటే, హాల్ టికెట్లు ఇవ్వనంటూ బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని కొంతమంది విద్యార్థులు స్థానిక విలేకరుల దృష్టికి తెచ్చారు. బీఈడీ కళాశాలను సందర్శించిన విలేకరులకు విద్యార్థులు తమ గోడును వెల్లబోసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం చేస్తున్న అకృత్యాలు, వేధింపులను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ అటెండెన్స్ ఫీజు పేరిట అదనంగా రూ. 10వేలు చెల్లించాల్సిందేనని, చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇచ్చేది లేదని ప్రిన్సిపాల్, యాజమాన్యం తేల్చి చెప్పినట్లు పేర్కొన్నారు. తాము సక్రమంగా తరగతులకు హాజరైనా కూడా కళాశాల ఖర్చుల పేరిట అదనంగా చెల్లించాల్సిందేనని అంటున్నారని తెలిపారు. అంతేకాకుండా కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులకు అసభ్యకర రీతిలో, అర్ధరాత్రి పూట వాట్సాప్ మెసేజ్‌లు చేసినట్లు ఆరోపించారు. ఇటీవల ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులు ఈ విషయంపై ప్రిన్సిపాల్ పై ఘర్షణ పడినట్లు విద్యార్థులు తెలిపారు. గతంలో కూడా కళాశాల యాజమాన్యం అక్రమంగా, అదనంగా ఫీజులు వసూలు చేస్తున్న విషయాలపై విద్యార్థి సంఘాలు కలెక్టర్, కాకతీయ యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని వివరించారు. అప్పట్లో వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు ఎటువంటి విచారణ జరుపలేదని, యథావిధిగా అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు వాపోయారు. గతంలో కూడా యాజమాన్యం వైఖరిపై విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళనకు దిగిన విద్యార్థులకే కళాశాల యాజమాన్యానికి అనుకూలంగా లేఖలు రాసి ఇవ్వాలంటూ ఒత్తిడికి గురి చేసినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. శనివారం జరిగిన సంఘటనల నేపథ్యంలో పాత్రికేయులు కళాశాలను సందర్శించగా, యాజమాన్యానికి, ప్రిన్సిపాల్‌కు అనుకూలంగా లేఖలు ఇవ్వని వారికి సైతం అక్కడ పాత్రికేయులు ఉండడంతో విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు.

## ఆర్మీ జవాన్ భార్యను హేళన చేసిన ప్రిన్సిపాల్!


ప్రిన్సిపాల్ తీరుపై మండిపడుతున్న ఆర్మీ జవాన్ భార్య

బీఈడీ కళాశాలలో రెండో సంవత్సరం విద్యానభ్యసిస్తున్న ఆర్మీ జవాన్ భార్య ప్రీతి మండల్ హాల్ టికెట్ కోసం శనివారం కళాశాలకు రాగా, అటెండెన్స్ ఫీజు చెల్లించాలని.. యాజమాన్యం, ప్రిన్సిపాల్ కు అనుకూలంగా లేఖ ఇవ్వాలని ప్రిన్సిపాల్ హుకుం జారీ చేశారు. దీంతో ఆమె లేఖ రాసి ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. జవాన్ భార్య పట్ల అనుచితంగా, వ్యంగ్యంగా, హేళనగా, చులకనగా మాట్లాడడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. నువ్వు సైనికుడ్ని అవమానించడం అంటే దేశాన్ని, భారత మాతను అవమానించినట్లేనని ఆవేదన వ్యక్తం చేసింది. 'నేను కూడా ఆర్మీ జవాన్‌అవుతా.. బార్డర్‌పై వెళ్లి పోరాడుతా'.. అని సదరు ప్రిన్సిపాల్‌అదోరకంగా అనడంతో ఆమె మరింత ఫైర్‌అయ్యింది. విజ్ఞతతో మాట్లాడాలని, నోటికి ఏదివస్తే అది మాట్లాడవద్దని హెచ్చరించింది. ప్రిన్సిపాల్ వ్యక్తిత్వంపై, యాజమాన్యం అదనపు ఫీజులు వసూలు చేయడం లేదంటూ లేని విషయాన్ని తామెలా చెప్పాలని ప్రశ్నించింది. మేమెందుకు మీకు సర్టిఫికెట్ ఇవ్వాలని అడిగింది. విద్యార్థిని మండిపడుతుండటంతో ప్రిన్సిపాల్‌అక్కడి నుంచి జారుకున్నారు. సరే.. సరే అనుకుంటూ వెళ్లిపోయారు. అదనంగా వసూలు చేస్తున్న ఫీజు విషయంలో అదనపు కలెక్టర్ కు సైతం ఇటీవల విద్యార్థులు ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి



బీఈడీ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి. కళాశాల యజమాన్యం, ప్రిన్సిపాల్ అదనపు ఫీజుల పేరిట విద్యార్థులను వేధించడం సరికాదు. గతంలో కూడా రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలపై అనేక ఆరోపణాలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు ఎందుకు విచారణ జరిపించి చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మానవ హక్కుల కమిషన్ కు సంప్రదిస్తాం.

**- సాహేరా బాను, రాష్ట్ర అధ్యక్షురాలు, మానవ హక్కుల సంరక్షణ సమితి**

## ఆరోపణలు అవాస్తవం

బీఈడీ కళాశాలలో జరుగుతున్న అక్రమాలు, అకృత్యాలపై కళాశాల ప్రిన్సిపాల్ ను శనివారం వివరణ కోరగా, తనపై వస్తున్న లైంగిక వేధింపులు, అధిక ఫీజుల వసూలు విషయాలు అవాస్తవమని ఆసిఫాబాద్‌లోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాలలో తన పాత్ర కేవలం కళాశాల పరిపాలన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమేనని అన్నారు. అదనంగా అధిక ఫీజుల విషయం కేవలం యాజమాన్యానికి సంబంధించిన విషయమన్నారు. మిగతా విషయాలకు తనకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. శనివారం తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులతో కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు కొందరు హాజరు శాతం తక్కువ ఉన్నదని, దానికి గాను అదనంగా ఫీజులు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. దానికి కళాశాల ప్రిన్సిపాల్ కు సంబంధం ఉండదని తెలిపారు.

**- రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలప్రిన్సిపాల్, ఆసిఫాబాద్**

## బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్**



విద్యార్థులకు అదనంగా అటెండెన్స్ పేరిట ఫీజులు వసూలు చేస్తున్న బీఈడీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల పట్ల ప్రిన్సిపాల్ అసభ్యకరంగా మాట్లాడుతున్నట్లు తమ దృష్టికి కూడా వచ్చిందని, ఈ విషయంపై విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. గతంలో కళాశాలలో ఇలాంటి ఘటనలు జరుగుతుంటే ఆందోళనలు చేశాం.. అయినా అధికారులు ఏం పట్టనట్టుగా వ్యవహరించడం సమంజసం కాదు. కళాశాలలో విద్య పూర్తి చేసిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు యాజమాన్యం ఇవ్వకపోవడంతో చాలామంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బీఈడీ కళాశాలలను వెంటనే మూసివేయాలి.





## విద్యార్థుల జీవితాలతో కళాశాల చెలగాటం

**కేవీపీఎస్‌జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్**

జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ధనర్జన ధ్యేయంగా కళాశాల యజమాన్యం విద్యార్థుల నుంచి అక్రమంగా అదనంగా అటెండెన్స్ పేరిట ఫీజులు వసూలు చేయడం నియమ నిబంధనలకు విరుద్ధం. నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని, గతంలో కూడా యూనివర్సిటీ అధికారులకు, కలెక్టర్ కు విన్నవించాం.. కానీ, కళాశాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కళాశాలలో జరుగుతున్న ఘటనలపై పూర్తిస్థాయి విచారణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడుతాం.

ఉద్యమ కెరటం
www.udyamakeratam.com
నిజం.. రక్తం రక్తితం
తెలుగు దినపత్రిక
UDYAMA KERATAM TELUGU DAILY



# మీతో నిలబడతాం

## భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన




**ఢిల్లీ:** ఇండియా-పాకిస్తాన్ మధ్య సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న ఈ క్లిష్ట సమయంలో, భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్ స్మృతి మంధాన భారత సాయుధ దళాల పట్ల తన గౌరవాన్ని, కృతజ్ఞతను హృదయపూర్వకంగా వ్యక్తపరిచారు. ప్రస్తుతం శ్రీలంకలో దక్షిణాఫ్రికా, ఆతిథ్య జట్టు శ్రీలంకతో జరుగుతున్న మహిళల వన్డే ట్రై-సిరీస్‌లో పాల్గొంటున్న ఆమె, భారత భద్రతా దళాల ధైర్యం, నిబద్ధత, త్యాగాన్ని కొనియాడుతూ, "మేము మీతో నిలబడతాము" అనే సందేశంతో ఓ ప్రత్యేకమైన పోస్ట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఆమె 28 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ, దేశం కోసం జీవితాలను అంకితం చేసే సైనికుల పట్ల ఆమె చూపించిన గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇటీవల భారత రక్షణ వ్యవస్థ, పాకిస్తాన్ వైమానిక దళాలు పౌర ప్రాంతాలపై దాడి చేయడానికి చేసిన ప్రయత్నాలను విజయవంతంగా అడ్డుకుంది. ఈ క్రమంలో సైన్యం చూపించిన చాకచక్యానికి దేశమంతా హర్షం వ్యక్తం చేస్తుండగా, క్రికెట్ లో కీలక పాత్ర పోషిస్తున్న స్మృతి మంధాన కూడా తమ దేశ సైనికుల పట్ల తన మద్దతును, అభిమానం చూపిస్తూ గొప్ప ఉదాహరణగా నిలిచారు. ఆమె పోస్ట్‌లో "మన భారత సాయుధ దళాల ధైర్యం, నిబద్ధత, త్యాగానికి సెల్యూట్" అంటూ ఉద్వేగభరితంగా పేర్కొన్నారు. క్రీడారంగంలో కూడా మంధాన మంచి ఫార్మ్‌లోనే ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మహిళల వన్డే ట్రై-సిరీస్‌లో ఆమె నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 148 పరుగులు చేసి 37 సగటుతో నిలిచారు. ఇటీవలి దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో మంధాన 51 పరుగులు చేసి భారత్‌కు విజయాన్ని అందించిన కీలక ఆటగాడిగా నిలిచారు. ఈ విజయంతో భారత జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి చేరడంలో ఆమె పాత్ర ప్రముఖంగా నిలిచింది. మే 11, ఆదివారం నాడు ఈ ట్రై-సిరీస్ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఫైనల్‌లో భారత్, శ్రీలంక జట్ల మధ్య తలపడి పోటీ నిర్వహించనుంది. కొలంబోలోని ప్రసిద్ధమైన ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈ మ్యాచ్ ఉదయం 10:00 గంటలకు ప్రారంభమవుతుంది. మంధాన ప్రస్తుత ఫార్మ్ దృష్ట్యా, ఫైనల్‌లో ఆమె నుండి మంచి ప్రదర్శనను ఆశిస్తూ అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ విధంగా, దేశ భద్రత కోసం విశ్వాసంతో నిలిచిన భారత సైన్యాన్ని కీర్తిస్తూ, అదే సమయంలో భారత జట్టుకు విజయాలు అందిస్తూ మంధాన ఆటతో, ఆత్మీయతతో దేశభక్తిని చాటారు. ఆమె మాటలు, ప్రవర్తన స్ఫూర్తిదాయకంగా ఉండి, దేశం మొత్తానికి గర్వకారణంగా నిలుస్తున్నాయి.

# టీమిండియా టెస్ట్ కెప్టెన్సీకి బుమ్రా సరైనోడు

## మాజీ క్రికెటర్ మదన్ లాల్




టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలను స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఇవ్వాలని మాజీ క్రికెటర్ మదన్ లాల్ అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించే సత్తా అతనికే ఉందని, రోహిత్ శర్మ స్థానాన్ని అతను మాత్రమే భర్తీ చేయగలడని చెప్పాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతానని హిట్ మ్యాన్ తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలెక్టర్ల సూచనల మేరకే అతను వీడ్కోలు పలికి ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌ను స్వాగతించిన మదన్‌లాల్.. తదుపరి కెప్టెన్‌గా బుమ్రానే నియమించాలని సూచించారు. వైస్ కెప్టెన్‌గా కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వాలని చెప్పారు. 'టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్‌గా జస్ప్రీత్ బుమ్రాకు అవకాశం ఇవ్వాలి. అతనే సరైనోడు. ఫిట్‌నెస్ అనేది భిన్నమైన అంశం. బుమ్రా ఫిట్‌గా ఉండి అందుబాటులో ఉంటే మాత్రం టెస్ట్ కెప్టెన్సీకి అతనే సరైనోడు. వైస్ కెప్టెన్‌గా యువ ఆటగాళ్లను నియమించవచ్చు.' అని మదన్ లాల్ చెప్పుకొచ్చారు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మదన్ లాల్ సమర్థించారు. పెద్ద ఆటగాళ్లు జట్టులోకి వచ్చినప్పుడు, వారికి మొదటి ప్రాధాన్యత లభిస్తుందని, అయితే ఫామ్ ఎప్పుడైనా మారవచ్చని ఆయన అన్నారు. రోహిత్ తన నిర్ణయం గురించి బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొని ఉంటాడని అభిప్రాయపడ్డారు. జస్ప్రీత్ బుమ్రా ఇప్పటి వరకు మూడు టెస్టుల్లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందులో భారత్ ఒకటి గెలిచి మరో రెండింటిలో ఓడింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా సారథ్యంలోనే టీమిండియా శుభారంభం చేసింది. అయితే ఈ సిరీస్‌లో ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెట్టి బౌలింగ్ చేయడం వల్ల ఆఖరి మ్యాచ్‌లో బుమ్రా వెన్ను గాయానికి గురయ్యాడు. ఈ గాయంతో సుదీర్ఘ కాలం జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ గాయాల బెడదతోనే బుమ్రాను లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడలేని పరిస్థితి నెలకొంది. జూన్ 20 నుంచి టీమిండియా.. ఇంగ్లండ్ పర్యటన మొదలవ్వనుంది.



# 23న కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్న బీసీసీఐ

## కెప్టెన్ రేసులో ముందంజలో గిల్?



ఐపీఎల్ 2025 సమయంలో రోహిత్ శర్మ టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. హిట్ మ్యాన్ సోషల్ మీడియాలో ఒక పోస్టును పంచుకోవడం ద్వారా తన రిటైర్మెంట్ ప్రకటించాడు. రోహిత్ శర్మ తర్వాత భారత టెస్ట్ జట్టుకు ఎవరు కెప్టెన్ అవుతారనేది ఇప్పుడు ఉన్న అతిపెద్ద ప్రశ్న. అయితే భారత టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎప్పుడు ప్రకటిస్తారు. దీనిపై తాజాగా కీలక అప్‌డేట్ వచ్చింది. రోహిత్ శర్మ అకస్మాత్తుగా టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ పరిస్థితిలో ఇప్పుడు బీసీసీఐ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసుకోవాలి. క్రిక్ బజ్ నివేదిక ప్రకారం.. మే 23న కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్నట్లు తెలిసింది. కొత్త కెప్టెన్‌ను ప్రకటించడానికి బీసీసీఐ మీడియా సమావేశాన్ని కూడా ప్లాన్ చేసింది. ఐపీఎల్ 2025 తర్వాత భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. అక్కడ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడతారు. ఈ పర్యటనలో భారత జట్టుకు కొత్త టెస్ట్ కెప్టెన్ రాబోతున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు జట్టును ఎంపిక చేసే ముందు కొత్త భారత టెస్ట్ కెప్టెన్‌ను ప్రకటిస్తారు. రోహిత్ శర్మ తర్వాత శుభ్‌మన్ గిల్ భారత టెస్ట్ జట్టుకు నాయకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. గిల్ ఈ రేసులో ముందంజలో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గురించి మాట్లాడుకుంటే.. బుమ్రా చాలా ముఖ్యమైన సిరీస్‌లు, టోర్నమెంట్లకు ముందు గాయం కారణంగా దూరమయ్యాడు. బుమ్రాకు తరచుగా గాయాల సమస్యలు ఉంటాయి. ఈ విషయంలో బుమ్రా కెప్టెన్సీ రేసులో చాలా వెనుకబడి ఉన్నాడు. కెప్టెన్ అయ్యే రేసులో గిల్ పేరు ముందంజలో ఉంది. శుభ్‌మన్ గిల్ భారత్ తరఫున టెస్ట్, వన్డే మ్యాచ్‌లు నిరంతరం ఆడుతున్నాడు. మీడియా నివేదికల ప్రకారం.. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ కావాలని ఆలోచిస్తున్నాడు. దీని గురించి విరాట్ కోహ్లీ బీసీసీఐతో కూడా మాట్లాడాడు. కానీ బీసీసీఐ, జట్టు యాజమాన్యం కొంత సమయం తీసుకుని జాగ్రత్తగా ఆలోచించమని కోహ్లీకి సూచించినట్లు తెలుస్తోంది. విరాట్ కోహ్లీ జట్టుకు చాలా ముఖ్యమైన ఆటగాడు కావడంతో ఇంగ్లాండ్ పర్యటనకు జట్టుతో వెళ్లాలని జట్టు యాజమాన్యం కోరుకుంటోంది. విరాట్ కోహ్లీ ఇంతకు ముందు ఇంగ్లాండ్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో చాలా పరుగులు చేశాడు.

# త్వరలోనే ఐపీఎల్ రీ స్టార్ట్


## మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ

భారత్‌లో నెలకొన్న టెన్షన్ వాతావరణం కారణంగా 2025 ఐపీఎల్? టోర్నమెంట్‌ను బీసీసీఐ వారం రోజులు వాయిదా వేసింది. ఈ సీజన్‌లో ఇంకో 16 మ్యాచ్‌లు (లీగ్ ం ప్లే ఆఫ్స్, ఫైనల్) మిగిలి ఉన్నాయి. అయితే ఈ టోర్నీ మళ్లీ ఎప్పుడు పునః ప్రారంభం అవుతుందోనని ఇప్పటికైతే క్లారిటీ లేదు. అయితే దీనిపై మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ స్పందించాడు. త్వరలోనే ఐపీఎల్ రీ స్టార్ట్ అవుతుందని చెప్పాడు. భారత్ దాడిని మరికొంత కాలం తట్టుకునే శక్తి పాకిస్థాన్‌కు లేదని గంగూలీ అన్నాడు. బీసీసీఐ తప్పకుండా ఈ ఐపీఎల్ టోర్నీని పూర్తి చేస్తుందని పేర్కొన్నాడు. 'భారత్?లో ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొంది. అందువల్లే బీసీసీఐ ఐపీఎల్‌ను వాయిదా వేసింది. భారత క్రికెటర్లే కాకుండా టోర్నీలో ఫారిన్ ప్లేయర్లు చాలా మంది ఆడుతున్నారు. వారి భద్రత విషయంలో అస్సలు రాజీ పడకూడదు' అని గంగూలీ వ్యాఖ్యానించాడు'ఐపీఎల్ 2025 సీజన్ త్వరలోనే రీ స్టార్ట్ అవుతుంది. టోర్నీ ప్రస్తుతం కీలక దశలో ఉంది. ధర్మశాల, ఢిల్లీ, చండీగఢ్, జైపూర్ స్టేడియాల్లో ఇంకొన్ని మ్యాచులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బీసీసీఐ తీసుకున్న నిర్ణయం సరైనదే. పంజాబ్- ఢిల్లీ మ్యాచ్? సమయంలో ఏం జరిగిందో చూశాం. అయితే ప్రస్తుత ఒత్తిడిని ఇంకొంత కాలం తట్టుకునే సీన్ పాక్?కు లేదు. త్వరలోనే పరిస్థితులు అదుపులోకి వస్తాయి. బీసీసీఐ తప్పకుండా ఐపీఎల్‌ను పూర్తి చేస్తుంది' అని గంగూలీ తెలిపాడు. అయితే, తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సీజన్ మే 25దాకా జరగాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ వాయిదా పడింది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల ప్రకారం, ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో గుజరాత్ జెయింట్స్ (16), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (16), పంజాబ్ కింగ్స్ (15), ముంబయి ఇండియన్స్ (14) జట్లు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి.




# ప్రేయసితో గబ్బర్ చక్కర్లు





శిఖర్ ధావన్, అతని ప్రేయసి సోఫీ షైన్ మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించారు. వీరిద్దరూ ఇటీవల ఎక్కడో కనిపించినట్లు, ఈ జంట తమ సంబంధం గురించి గోప్యంగా సంకేతాలు ఇచ్చినప్పటికీ, ఇప్పుడు వారు ఒకరికొకరు సహజంగా, ప్రేమలో ఉన్నట్లు కనిపించారు. ఈసారి, వారు తమ ప్రేమను దాచుకోవాలని కోరుకోకుండా, పూర్తిగా ఎంజాయ్ చేస్తూ కలిసి కనిపించారు. శిఖర్ ధావన్ తన ప్రేయసితో విమానాశ్రయం ప్రదేశంలో బయటకు నడుస్తూ కనిపించాడు. గబ్బర్ ఎర్రటి బాలెన్సియాగా టీ షర్ట్, నల్ల జాగర్లు, ఎర్రటి స్నీకర్లతో చాలా స్టైలిష్ గా కనిపించాడు. తన సిగ్నేచర్ సన్నీలను ధరించి, ధావన్ తన ప్రత్యేకమైన స్టైల్ చూపిస్తూ, ఏదైనా అతను ధరించిన దుస్తులలో ప్రశంసలు పొందేవాడిగా కనిపించాడు. అదే సమయంలో, సోఫీ షైన్ కూడా తన స్టైలిష్ లుక్‌లో కనిపించింది. పౌడర్-బ్లూ షర్ట్, రిలాక్స్-ఫిట్ జీన్స్, డార్క్ షేడ్స్‌తో ఆమె సున్నితమైన శైలిలో కూల్‌గా కనిపించింది. గత ఏడాది, శిఖర్ ధావన్ తన భార్య ఆయేషా ముఖర్జీతో విడిపోయిన తర్వాత, చాలా నిశ్శబ్దంగా ఉండే ప్రయత్నం చేశారు. అయితే, సోఫీ షైన్ ఈ జంట ప్రేమకథను బయటపెట్టాలని నిర్ణయించుకుంది. గత వారం, సోఫీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో "నా" అంటూ ఒక మధురమైన పోస్ట్ పంచుకుంది. ఈ పోస్ట్ అభిమానులందరినీ ఆశ్చర్యపరిచింది, ఎందుకంటే ఈ విధంగా ఆమె ఈ ప్రేమను అధికారికంగా ప్రకటించింది. ఇంతవరకు, శిఖర్-సోఫీ ఈ ప్రేమకథను జూన్ 2023లో ప్రారంభించారు. మొదట, ధావన్ సోఫీ షైన్ పోస్ట్‌లలో ఒకదాన్ని లైక్ చేయడంతో ఈ కథ మొదలైంది. మొదటి చూపులో అది ఒక సాధారణ స్నేహం వంటిదిగా కనిపించగా, తరువాత అది ఒక ప్రేమకథగా మారింది. ఈ జంట దుబాయ్‌లో కలిసినట్లు చెబుతున్నారు, అక్కడ వారు స్నేహితులుగా మొదలయ్యారు, అయితే తరువాత వారి మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది. ఈ జంట ప్రస్తుతం ఒక సంవత్సరం పాటు కలిసి ఉంటున్నట్లు సమాచారం. అందువల్ల, వారు తరచూ కలిసి కనిపించడం, తమ ప్రేమను వ్యక్తం చేయడం కొనసాగిస్తుంటారు.

# చిక్కుల్లో అంబటి రాయుడు



భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం ఐపీఎల్ మ్యాచ్‌ను నిలిపివేశారు. ఇప్పుడు ఏకంగా ఐపీఎల్ 2025నే వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. 'ఆపరేషన్ సింధూర్' తర్వాత రెండు దేశాల సైన్యా మధ్య వార్ నడుస్తోంది. పాకిస్తాన్ ప్రతి దుష్ట ప్రయత్నానికి భారత సైన్యం తగిన విధంగా సమాధానం ఇస్తోంది. టీమ్ ఇండియా క్రికెటర్లు కూడా నిరంతరం దేశ సైన్యానికి ధైర్యం చెబుతున్నారు. ఇదే సమయంలో మాజీ భారత క్రికెటర్ అంబటి రాయుడు చేసిన ఒక పోస్ట్ దుమారం రేపింది. అంబటి రాయుడు '%ళ%' లో గురువారం మే 8న ఒక పోస్ట్ చేశాడు. పాకిస్తాన్ భారతదేశంపై డ్రోన్, క్షిపణుల దాడి చేసిన సమయంలో ఈ పోస్ట్ చేశాడు. భారత సైన్యాల వాయు రక్షణ వ్యవస్థ ఈ దాడులను తప్పికొట్టాయి. పాకిస్థాన్ దుష్ట పన్నాగాలపై భారతదేశం ఘాటుగా స్పందిస్తున్న వేళ రాయుడు, "కన్నుకు కన్ను అంటే ప్రపంచమంతా అంధకారమవుతుంది." అని ట్వీట్ చేశాడు. ఆయన పోస్టుపై నెటిజన్లు ఫైర్ అయ్యారు. ఒక నెటిజన్ వెంటనే ట్వీట్‌ను తొలగించమని కోరాడు. మరొకరు, మనం అలా అనుకుంటున్నంత వరకు మన రెండు కళ్ళు పోతాయని అన్నారు. వివాదం పెరుగుతున్న విషయాన్ని గమనించిన రాయుడు మరో పోస్ట్ చేసి నష్ట నివారణకు ప్రయత్నించాడు. ఆయన రాశారు-"జమ్మూ కాశ్మీర్, పంజాబ్, భారత సరిహద్దులోని ఇతర ప్రాంతాలలో అందరి భద్రత, శాంతి కోసం ప్రార్థన చేస్తున్నాను. దీనితో ప్రభావితమైన ప్రతి ఒక్కరికి బలాన్ని, భద్రతను , త్వరితగతిన కోలుకునే శక్తి ఇవ్వాలాని ఆశిస్తున్నాను. జై హింద్." అని పోస్టు చేశాడు. ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు 26 నిర్దోషులను చంపారు. దీనికి ప్రతిగానే భారతదేశం, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై దాడి చేసింది. మొత్తం 9 ఎయిర్ స్ట్రైక్‌లు చేసింది. ఈ ఎయిర్ స్ట్రైక్‌లో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలను నాశనం అయ్యాయి. అప్పటి నుంచి పాకిస్తాన్ ఆగ్రహంతో ఊగిపోతోంది. ఏదోలా భారత్‌ను దెబ్బతీయాలని విఫలయత్నం చేస్తోంది. పాకిస్థాన్ చేస్తున్న అన్ని దుస్సాహసాలను భారత్ విజయవంతంగా తిప్పికొడుతోంది.

# ఉద్యమ కెరటం

www.udyamakeratam.com

నిజం.. రక్షతి రక్షితః

తెలుగు దినపత్రిక

UDYAMA KERATAM TELUGU DAILY







# దశాబ్దాల బాధకు ఇది సమాధానం

## యుద్ధంపై జాన్వీకపూర్ పోస్ట్



పాకిస్థాన్-భారత్ యుద్ధ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. సామాన్యుడి నుంచి సెలబ్రిటీల దాకా అందరూ ఇండియన్ ఆర్మీకి మద్దతు పలుకుతున్నారు. జాన్వీకపూర్ ఇప్పటికే వరుసగా పోస్టులు పెడుతూ ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తోంది. తాజాగా యుద్ధ వాతావరణం గురించి సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఇన్ని రోజులు మనం యుద్ధం రావొద్దనే కోరుకున్నాం. కానీ టెర్రరిస్టుల మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. ఇండియా ఎన్నడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడులను తిప్పి కొడుతున్నాం. కానీ దశాబ్దాల బాధ ఇప్పుడు పెరిగింది. ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ఇది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. -టె-ర్రరిస్టులు అనే వారు భూమ్మీద ఉండటానికి వీల్లేదు. మన సైనికులు బార్డర్ దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సౌభ్రాతృత్వాన్ని కాపాడుతున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సేఫ్‌గా ఉంటు-న్నాం. ఇలాంటి -టైమ్ లో దేశమంత మన ఇండియన్ ఆర్మీకి మద్దతు నిలవాలి. ఎలాంటి ఫేక్ న్యూస్ ను వ్యాప్తి చేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ-.



# నాకు తెలియకుండానే..

తాను హీరో అని తనకే తెలియకుండా ఒక సినిమా చేసినట్లు- వెన్నెల కిషోర్ చెప్పుకొచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, వెన్నెల కిషోర్ కీలకపాత్రలో 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాలో హీరో వెన్నెల కిషోర్ అని ముందు నుంచి సినిమా టీం చెబుతూ వచ్చింది. అంతేకాక, వెన్నెల కిషోర్ ప్రమోషన్స్‌కి ఎందుకు రాలేదు అంటే, అది ఆయన్ని అడగాలంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ అయింది. ఈ విషయం మీద వెన్నెల కిషోర్ స్పందించాడు. నాకు నేను ఈ సినిమాలో హీరో అనే సంగతి తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను. ఎందుకంటే కొంతమంది కథ మొత్తం అడిగితే ఫీల్ అవుతున్నారు. కాబట్టి నా వరకు ట్రాక్ చెప్పమన్నాను, చెప్పారు. ఏడు రోజుల డేట్స్ ఇచ్చాను, షూట్ చేశాను. తర్వాత ఇంకొన్ని ఎమోషనల్ సీన్స్ యాడ్ చేయాలన్నారు. వెళ్లి నటించి వచ్చాను. సినిమా రిలీజ్ సమయంలో నేను హీరో అని పోస్టర్ వేస్తే ఆశ్చర్యపోయాను. అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు ముందు చెప్పినప్పుడు ఆ సినిమాలో వేరే హీరో ఉన్నాడు, అతనికి జంటగా అనన్య నాగాళ్ల నటిస్తుందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇది నాకు తెలియకుండా జరిగింది. ముందే నాకు దర్శక నిర్మాతలు నేనే హీరోనని చెప్పి ఉంటే, అప్పుడు నేను ప్రమోషన్స్‌కి కూడా వచ్చి ఉండేవాడినేమో అంటూ ఆయన మాట్లాడారు.

# ప్రదీప్ రంగనాథన్.. డ్యూడ్ మూవీ




తమిళ సినీ ఇండస్ట్రీలో 'లవ్ టుడే' సినిమాతో నటుడిగా, డైరెక్టర్‌గా సంచలన ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రంగనాథన్, 'డ్రాగన్' సినిమాతో తన సక్సెస్ జర్నీని కంటిన్యూ చేశాడు. ఈ ద్విభాషా మూవీ తమిళ, తెలుగు ఆడియన్స్‌ను ఫిదా చేస్తూ అతని ఫేమ్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. బ్యాక్ టు- బ్యాక్ హిట్స్‌తో జోష్‌లో ఉన్న ప్రదీప్, ఇప్పుడు బిగ్ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోగా చేస్తున్నాడు. ఈ సినిమాతో కీర్తిస్వరన్ డైరెక్టర్‌గా డెబ్యూ చేయబోతున్నాడు. 'ప్రేమలు' స్టార్ మమితా బైజు ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుండగా, సీనియర్ యాక్టర్ శరత్ కుమార్ ఓ కీలక రోల్‌లో నటిస్తున్నాడు. మేకర్స్ సినిమా -టైటిల్‌ను ఆఫీషియల్‌గా రివీల్ చేసి, పోస్టర్‌ను లాంచ్ చేశారు. అలాగే, రిలీజ్ డేట్ గురించి కూడా బిగ్ అనౌన్స్‌మెంట్ చేశారు. 'డ్యూడ్' అనే కూల్, యూత్‌ఫుల్ -టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్ సీరియస్ అండ్ ఇం-టె-న్స్ లుక్‌లో దర్శనమిచ్చాడు. అతని ఫేస్‌పై గాయాలు, హ్యాండ్‌లో మంగళసూత్రం, గట్స్‌తో నిండిన ఎక్స్‌ప్రెషన్‌తో ఈ పోస్టర్ కళ్లు చెదిరేలా ఉంది. -టైటిల్, ఫస్ట్ లుక్ చూస్తే, 'డ్యూడ్' ఒక మోడర్న్ ట్విస్ట్‌తో ఫుల్ ఎంటర్-టైన్‌మెంట్ ప్యాకేజ్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా 2025 దీపావళి సీజన్‌లో వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ ద్విభాషా ప్రాజెక్ట్ కోసం యంగ్ అండ్ టాలెం-టె-డ్ టీ-మ్‌ను రంగంలోకి దింపింది. మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో రైజింగ్ స్టార్ సాయి అభ్యంకర్ లీడ్ చేస్తుండగా, సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి హ్యాండిల్ చేస్తున్నాడు. ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు, ఎడిటింగ్‌ను బరత్ విక్రమన్ స్టీర్ చేస్తున్నారు, సినిమా విజువల్ వరల్డ్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లడానికిప్రస్తుతం షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. దీపావళికి ఆడియన్స్‌కు కిక్కిచ్చే ఎంటర్-టైనర్ ఇవ్వడానికి టీ-మ్ ఫుల్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. 'డ్యూడ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ లాంగ్వేజెస్‌లో రిలీజ్ కానుంది.

# బాలీవుడ్‌లో ఆపరేషన్ సిందూర్!



'ఆపరేషన్ సిందూర్' శత్రుదేశం వెన్నులో వణుకుపుట్టిస్తోన్న పేరిది. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకొంటున్న ఈ పేరుతో సినిమా రానుంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్‌లో సినిమాను తెరకెక్కించనున్నారు. దీనిపై అధికారిక ప్రకటన చేసి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ్ నితిన్ దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో యూనిఫాం ధరించి.. రైఫిల్ పట్టుకొని నుదుటన సిందూరం పెట్టుకుంటోన్న మహిళను చూపారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్‌లో ఫైటర్ జెట్‌లను, మండుతున్న యుద్ధ భూమిని చూపారు. ప్రస్తుతం భారత్ - పాక్‌ల మధ్య జరుగుతోన్న ఉద్రిక్తతలను, పహల్గాం సంఘటనను ఈ చిత్రంలో చూపనున్నట్లు- స్పష్టమవుతోంది. త్వరలోనే ఇందులో నటించనున్న నటీ-నటు-ల వివరాలను వెల్లడించనున్నారు. ఉగ్రవాద లోకానికి వణుకు పుట్టించిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీసేందుకు సినీ దర్శక నిర్మాతలు పోటీ-పడ్డారు. ఈ పేరును ప్రకటించినప్పుడే సుమారు 15 నిర్మాణ సంస్థలు దీనికోసం రిజిస్టర్ చేసుకున్నాయి. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ స్టూడియోస్, టీ--సిరీస్ లాంటి కొన్ని బాలీవుడ్ బడా నిర్మాణసంస్థలు కూడా ఈ పేరు కోసం పోటీ-పడుతూ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

# మరోమారు విజయ్, రష్మిక జోడీ

విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి.సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక. బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 - 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యానముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు - శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు-గా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు- తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు- తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు- ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.

